# బలవంతపు భూసేకరణ ఆపాలని సీఎంకు వినతి



5 పేజీలో...



ESTD : 1999
విజన్ ఆంధ్ర
తెలుగు దినపత్రిక
VISION ANDHRA TELUGU DAILY
స్టేట్ విజన్
STATE VISION
గురువారం 18-06-2026 పేజీలు : 16

# విద్యా వికాసం కోసమే "తెలంగాణ పబ్లిక్ స్కూల్స్"

- ప్రతీ నియోజకవర్గానికో తెలంగాణ పబ్లిక్ స్కూల్
- తరగతి గదుల్లోనే తెలంగాణ భవిష్యత్
- దేశానికి రోల్ మోడల్ గా రాష్ట్రాన్ని తీర్చిదిద్దడమే లక్ష్యం
- ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి

విధ్వంసమైన విద్యా వ్యవస్థను వికాసం వైపు నడిపిండంలో భాగంగానే తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ ఏర్పాటు చేస్తున్నామని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. రంగారెడ్డి జిల్లా మంచాల మండలం ఆరుట్ల గ్రామంలో తెలంగాణ పబ్లిక్ స్కూల్ ను ప్రారంభించి విద్యార్థులకు అంకితమిచ్చారు. తెలంగాణ భవిష్యత్ అద్దాల మేడలు రంగుల గోడల్లో లేదని, తరగతి గదుల్లోనే ఉందని తాము సంపూర్ణంగా విశ్వసించామన్నారు. అందుకే విద్యాకమిషన్ నివేదిక ప్రకారం ప్రభుత్వం పాఠశాలలల్ని బలోపేతం చేస్తూ ముందుకు వెళుతున్నామని తెలిపారు. తెలంగాణ పబ్లిక్ స్కూల్ కేవలం ఆరుట్ల గ్రామానికి, ఇబ్రహీంపట్నం నియోజకవర్గానికి మాత్రమే స్ఫూర్తి కాదని, తెలంగాణలోని 27 లక్షల మంది ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఇది స్ఫూర్తిగా నిలుస్తుందన్నారు. ఆరుట్ల తెలంగాణ పబ్లిక్ స్కూల్ లో ఇప్పటికే 1,814 మంది విద్యార్థులు చేరారని, ఒక ప్రభుత్వ పాఠశాలకు నో అడ్మిషన్ బోర్డు పెట్టే పరిస్థితి ఉందంటే విద్యా ప్రమాణాల్లో ప్రభుత్వ చిత్తశుద్ధి ఎలాంటిదో స్పష్టమవుతోందని చెప్పారు. ఈ సందర్భంగా మెరుగైన విద్యను అందిస్తూ ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్ల పెరిగేందుకు కృషి చేస్తున్న ఉపాధ్యాయులను ముఖ్యమంత్రి అభినందించారు.



5 పేజీలో...

# మున్నూరు కాపు ట్రస్ట్ భవనానికి రూ..5 కోట్లు




- మంత్రి పొన్నం ప్రభాకర్
- ఐకమత్యంతో ముందుకు సాగితే మున్నూరు కాపుల హక్కులు సాధించవచ్చు హన్మంతరావు
- కార్యక్రమ విజయానికి సహకరించిన అందరికీ కృతజ్ఞతలు సర్దార్ పుట్ట పురుషోత్తం

విజన్ ఆంధ్ర (17)హైదరాబాద్ : మున్నూరు కాపు ట్రస్ట్ భవన నిర్మాణానికి తొలి దశలో రూ. 5 కోట్లు మంజూరు చేస్తున్నట్లు రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రకటించారు, తెలంగాణ రాష్ట్ర మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో రవీంద్ర భారతిలో జరిగిన మున్నూరు కాపు ప్రజా ప్రతినిధుల సన్మాన సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు, ఈ

6 పేజీలో...

# గంజాయి పట్టివేత

**ఇద్దరినీ నిందితులు అరెస్టు రిమాండ్.**



2 పేజీలో...



## మేడారంలో సమ్మక్క-సారలమ్మలను దర్శించుకున్న బీజేపీ నేతలు

**ప్రత్యేక పూజల్లో పాల్గొన్న రావుల శేషగిరి, జేకే శేఖర్ యాదవ్**

కుత్బుల్లాపూర్, జూన్ 17 (ప్రతినిధి): భారతీయ జనతా పార్టీ తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ సెల్ కో-కన్వీనర్, గాజులరామారం మాజీ కార్పొరేటర్ రావుల శేషగిరి మేడారం వనదేవతలు సమ్మక్క -సారలమ్మలను బుధవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనతో పాటు బీజేపీ నాయకులు జేకే శేఖర్ యాదవ్, మిత్రబృందం ఆలయాన్ని సందర్శించి అమ్మవార్ల ఆశీస్సులు పొందారు. రాష్ట్ర ప్రజలు సుఖశాంతులతో ఉండాలని, తెలంగాణ అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి చెందాలని వారు ప్రార్థించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో భక్తులతో మమేకమైన నాయకులు, మేడారం జాతరకు ఉన్న చారిత్రక, ఆధ్యాత్మిక విశిష్టతను కొనియాడారు. సమ్మక్క--సారలమ్మల దివ్య ఆశీస్సులతో ప్రజలందరికీ ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలు కలగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పలువురు బీజేపీ కార్యకర్తలు, స్థానిక నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

## బి ఎల్ ఓ లు, బి ఎల్ ఓ సూపర్‌వైజర్లకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం

కాటారం డివిజన్ ప్రతినిధి, జూన్ 17 (విజన్ ఆంధ్ర) : భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు నిర్వహించబడుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ ఐ ఆర్) కార్యక్రమంపై అవగాహన కల్పించేందుకు జయశంకర్ భూపాలపల్లి జిల్లా పరిధిలోని కాటారం, మహాముత్తారం, మల్హర్‌రావు మండలాలకు చెందిన 87 మంది బి ఎల్ ఓ లు, 10 మంది బి ఎల్ ఓ సూపర్‌వైజర్లకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు కాటారం తహసిల్దార్ నాగరాజు తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమం జూన్ 18 న ఉదయం 11 గంటలకు కాటారం ఎంపిడిఓ కార్యాలయంలో నిర్వహించబడుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీవోతో పాటు మాస్టర్ ట్రైనర్లు పాల్గొని ఎస్ ఐ ఆర్ కార్యక్రమం అమలు విధానం, ఓటరు జాబితాల సవరణ ప్రక్రియ, క్షేత్రస్థాయి బాధ్యతలు, ఎన్నికల సంఘం మార్గదర్శకాలు తదితర అంశాలపై శిక్షణ అందజేస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి కాటారం మండలం నుంచి 36 మంది బి ఎల్ ఓ లు, 4 మంది బి ఎల్ ఓ సూపర్‌వైజర్లు, మహాముత్తారం మండలం నుంచి 27 మంది బిఎల్ఓ లు, 3 మంది బిఎల్ఓ సూపర్‌వైజర్లు, మల్హర్‌రావు మండలం నుంచి 24 మంది బి ఎల్ ఓ లు, 3 మంది బి ఎల్ ఓ సూపర్‌వైజర్లు హాజరు కానున్నట్లు తెలిపారు. సమస్త మీడియా ప్రతినిధులు ఈ శిక్షణ కార్యక్రమానికి హాజరై, భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న ఎస్ ఐ ఆర్ లక్ష్యాలు, విధివిధానాలు, ప్రాముఖ్యతను ప్రజలకు విస్తృతంగా తెలియజేసే కార్యక్రమానికి విస్తృత ప్రచారం కల్పించాలని తహసిల్దార్ నాగరాజు విజ్ఞప్తి చేశారు.

## గంజాయి పట్టివేత

బూర్గంపాడు మండల ప్రతినిధి జూన్ 17 (విజన్ ఆంధ్ర ) : ద్విచక్ర వాహనంపై అక్రమంగా గంజాయి తరలిస్తున్న బూర్గంపాడు పోలీసులకు ఇద్దరు వ్యక్తులు పట్టుబడ్డారు దీనికి సంబంధించి ఎస్సై మే డే ప్రసాద్ తెలిపిన వివరాలు ప్రకారం. ఒడిస్సా నుంచి ములుగు జిల్లా మంగపేట బజాజ్ పల్సర్ TG10A8506 వాహనంపై అక్రమంగా 2.1 కిలోల గంజాయి తరలిస్తుండగా ములుగు జిల్లా మంగపేట చెందిన బడే భరత్ ఉప్పరపల్లి వెంకటేశ్వర్లు మేజర్ గ్రామ పంచాయతీల సారపాక పల్లె ప్రకృతి వనం వద్ద పోలీసులు పట్టుకున్నారు పట్టుబడ్డ గంజాయి విలువ రూపాయలు 1 5 లక్షలు ఉంటుందని తెలిపారు గంజాయితో పాటు ద్విచక్ర వాహనం రెండు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకొని పట్టుబడ్డ ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి రిమాండ్ చేసినట్టు ఎస్సై మే డే ప్రసాదతెలిపారు

# డీఏపీ ఎరువుల కొరత తీర్చాలి

**తహసీల్దార్‌కు రైతుల వినతిపత్రం**



చౌటకూరు, జూన్ 17 విజన్ ఆంధ్ర : మండల కేంద్రంలోని ఆగ్రోస్ ఎరువుల దుకాణంలో డీఏపీ ఎరువులను తక్షణమే అందుబాటులో ఉంచాలని కోరుతూ రైతులు తహసీల్దార్ నామాల కిష్టయ్యకు వినతిపత్రం సమర్పించారు. ప్రస్తుతం ఖరీఫ్ సాగు పనులు ఊపందుకుంటున్న తరుణంలో డీఏపీ ఎరువుల కొరత రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ, గత నెల రోజులుగా ప్రభుత్వం ఆగ్రోస్ కేంద్రాలకు డీఏపీ ఎరువుల సరఫరా చేయకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. వ్యవసాయ పనులు వేగంగా సాగుతున్న సమయంలో అవసరమైన ఎరువులు అందుబాటులో లేకపోవడం వల్ల పంటల సాగుపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని పేర్కొన్నారు.ప్రభుత్వ కేంద్రాల్లో ఎరువులు లభించకపోవడంతో ప్రైవేటు దుకాణాలను ఆశ్రయించాల్సి వస్తోందని, అక్కడ అధిక ధరలకు ఎరువులు విక్రయించడం వల్ల రైతులపై అదనపు ఆర్థిక భారం పడుతోందని అన్నారు. రైతులకు అవసరమైన డీఏపీ ఎరువులను వెంటనే సరఫరా చేసి ఆగ్రోస్ కేంద్రాల్లో అందుబాటులో ఉంచేందుకు చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌ను కోరారు.రైతుల సమస్యలను విన్న తహసీల్దార్ సంబంధిత అధికారుల దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చినట్లు రైతులు తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులు ఎండి జాఫర్, మంగలి చిన్నయ్య, కొలూరి కిషన్, మలేశం తదితరులు పాల్గొని వినతిపత్రం అందజేశారు. రైతుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించి ఎరువుల కొరతను నివారించాలని వారు డిమాండ్ చేశారు.

## మైనర్ బాలికపై అత్యాచారానికి పాల్పడిన వ్యక్తిని శిక్షించాలి

**- మహిళా రక్షణ చట్టం కఠినంగా అమలు చేయాలి**

**- ఐద్వా డివిజన్ అధ్యక్షురాలు కొండ బోయిన ఉమాపతి**



కారేపల్లి,జూన్ 17 (విజన్ ఆంధ్ర) : ఖమ్మం నగరంలో మైనర్ బాలికపై అత్యాచారానికి పాల్పడిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలని,ఇలాంటి అమానుష ఘటనలు పునరావృతం కాకుండా మహిళ రక్షణ చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని ఐద్వా వైరా డివిజన్ అధ్యక్షురాలు కొండబోయిన ఉమామతి డిమాండ్ చేశారు.బుధవారం కారేపల్లిలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ 12 సంవత్సరాల మైనర్ బాలిక అని చూడకుండా కామాంధుడు కర్కశంగా అత్యాచారం చేసి దాన్ని కప్పిపుచ్చుకొనుటకు అపార్ట్మెంట్ పై నుండి కిందికి తోసి హత్య చేయాలని చూశాడని తీవ్ర గాయాలతో హైదరాబాద్ నిమ్స్ ఆస్పటల్ లో చికిత్స పొందుతున్న బాలికకు ప్రభుత్వం మెరుగైన వైద్యం అందించటంతో పాటు బాలిక కుటుంబాన్ని అన్ని రకాలుగా ఆదుకోవాలని, అత్యాచారానికి పాల్పడిన నిందితుడిని కఠినంగా శిక్షించి మరలా ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా బాలికలకు,మహిళలకు రక్షణగా ఉన్న చట్టాలను అమలు జరపాలని ఆమె కోరారు.దేశంలో మహిళలపై అత్యాచారాలు, హత్యలు రోజు రోజుకి పెరిగిపోతున్నాయని, నిందితులని గుర్తించడంలో గుర్తించిన వారిని శిక్షించటంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమవుతున్నాయని సామాజిక ఆర్థిక రాజకీయ పలుకుబడులతో దోషులు శిక్షలు నుండి తప్పించుకునే అవకాశం కల్పిస్తున్నందున మహిళలకి రక్షణ లేకుండా పోయిందన్నారు. మైనర్ బాలికపై అత్యాచారానికి పాల్పడిన వ్యక్తిని కఠినంగా శిక్షించి ప్రభుత్వం చిత్తశుద్ధి చాటుకోవాలని ఆమె కోరారు

# పెన్షన్లపై కాంగ్రెస్‌కు 'టెన్షన్'..

**- 20 లక్షల దరఖాస్తులు పెండింగ్: బీఆర్ఎస్**

**- ఎన్నికల హామీలు అమలు చేయాలని డిమాండ్**

**- పేదల సామాజిక భద్రతను నిర్లక్ష్యం చేస్తున్న ప్రభుత్వం**

**- బడ్జెట్‌లో కేవలం 2 లక్షల కొత్త పెన్షన్లకే పరిమితం**

**- అవసరమైతే ప్రజలతో కలిసి ఆందోళనలు: వీరారెడ్డి నరేందర్ రెడ్డి**



జీడిమెట్ల, జూన్ 17 (విజన్ ఆంధ్ర): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి గణనీయమైన కాలం గడిచినా, పేదలకు సామాజిక భద్రత కల్పించే పెన్షన్ల విషయంలో పూర్తిగా విఫలమైందని బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు వీరారెడ్డి నరేందర్ రెడ్డి విమర్శించారు. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 20 లక్షల కొత్త, పాత పెన్షన్ దరఖాస్తులు పెండింగ్‌లో ఉండటంతో వృద్ధులు, వితంతువులు, వికలాంగులు, ఒంటరి మహిళలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ తన మేనిఫెస్టోలో దివ్యాంగులకు నెలకు రూ.6,000, వృద్ధులు మరియు వితంతువులకు రూ.4,000 పెన్షన్ అందిస్తామని హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. అయితే అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీల అమలుపై ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. ప్రస్తుతం రాష్ట్రంలో దాదాపు 20 లక్షల మంది అర్హులు చేయూత పెన్షన్ కోసం ఎదురుచూస్తున్నప్పటికీ, ప్రభుత్వం బడ్జెట్‌లో కేవలం 2 లక్షల కొత్త పెన్షన్లకే పరిమితం చేయడం దారుణమని విమర్శించారు. దీంతో లక్షలాది మంది పేదలు ఆశాభంగానికి గురవుతున్నారని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ గౌరవప్రదంగా, ఎలాంటి ఇబ్బందులు లేకుండా పెన్షన్లు ఇంటి వద్దకే అందేవని తెలిపారు. ప్రస్తుతం కాంగ్రెస్ పాలనలో పేదలకు పెన్షన్ల స్థానంలో టెన్షన్ మాత్రమే మిగిలిందని ఎద్దేవా చేశారు. జీడిమెట్ల 132వ డివిజన్‌తో పాటు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అర్హులందరికీ పెండింగ్‌లో ఉన్న పెన్షన్లను వెంటనే మంజూరు చేయాలని, ఎన్నికల హామీ మేరకు పెంచిన పెన్షన్ మొత్తాలను తక్షణమే అమలు చేయాలని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ తరపున ఆయన డిమాండ్ చేశారు. పేదల హక్కుల పరిరక్షణ కోసం బీఆర్ఎస్ పార్టీ నిరంతరం పోరాడుతుందని, అవసరమైతే ప్రజలతో కలిసి ఆందోళనలు చేపట్టేందుకు కూడా వెనుకాడబోదని వీరారెడ్డి నరేందర్ రెడ్డి హెచ్చరించారు.




## "ప్రైవేట్ విద్యా వ్యాపారాన్ని అడ్డుకోవాలి"

### -ఐక్య విద్యార్థి సంఘాల డిమాండ్

మందమర్రి, జూన్ 17 (విజన్ ఆంధ్ర) : మండలంలోని ప్రైవేట్ పాఠశాలల్లో కొనసాగుతున్న విద్యా వ్యాపారాన్ని అడ్డుకోవాలని కోరుతూ మండల విద్యాశాఖ అధికారి కార్యాలయంలో ఐక్య విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో బుధవారం ఫిర్యాదు చేశారు. నూతన విద్యా సంవత్సరం ప్రారంభమైన నేపథ్యంలో పాఠశాలలను వ్యాపార కేంద్రాలుగా మార్చి పాఠ్యపుస్తకాలు,యూనిఫామ్ దుస్తులు,షూలు,ఇతర స్టేషనరీ వస్తువులను మార్కెట్ కంటే అధిక ధరలు ముద్రించి ఆర్థిక దోపిడీకి పాల్పడుతున్నారని తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా పాఠ్య పుస్తకాలను విక్రయిస్తున్న పాఠశాలలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు శ్రీనివాస్,క్రాంతి,అభిరామ్ కోరారు.

## ధర్మసాగర్ ప్రజలకు అందుబాటులో నూతన బస్ సర్వీస్ ప్రారంభం

ధర్మసాగర్/హనుమకొండ జూన్ 17 ( విజన్ ఆంధ్ర ): ధర్మసాగర్ మండల ప్రజలకు ఊరటనిచ్చేలా కొత్త బస్సు సర్వీసులు బుధవారం ప్రారంభమయ్యాయి. ధర్మసాగర్ గ్రామ సర్పంచ్ మాచర్ల జ్యోతి ఏలియా ఆధ్వర్యంలో బస్సులను ఘనంగా ప్రారంభించారు.

ధర్మసాగర్ నుంచి ఉనికిచెర్ల, లంబాడి తండా, వడ్డేపల్లి మీదుగా హనుమకొండ బస్టాండ్ వరకు ఈ బస్సు సర్వీసులు నడవనున్నాయి. దీంతో విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారులు, రైతులు, వైద్య సేవల కోసం హనుమకొండకు వెళ్లే ప్రజలకు రాకపోకలు మరింత సులభతరం కానున్నాయి.

ఈ సందర్భంగా సర్పంచ్ మాచర్ల జ్యోతి ఏలియా మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంత ప్రజలకు ఈ సర్వీసులు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు.

ప్రత్యేకించి విద్యార్థులు, మహిళలు, వృద్ధులు, రోజువారీ పనుల నిమిత్తం పట్టణాలకు వెళ్లే ప్రజలకు ఈ బస్సు సర్వీసులు వరంగా మారనున్నాయని గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు. .ఈ కార్యక్రమంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, యువకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## పోలంపల్లి వాసి అనుమానాస్పద మృతి

కారేపల్లి, జూన్ 17(విజన్ ఆంధ్ర) : నెల రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లిపోయిన వ్యక్తి మృతదేహం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా లక్ష్మీదేవిపల్లి మండల పరిధిలోని గట్టుమల్ల సమీప అటవీ ప్రాంతంలో లభ్యమైంది. మృతుడు కారేపల్లి మండలం పోలంపల్లి గ్రామానికి చెందిన మూతి వీరభద్రంగా గుర్తించారు. స్థానికుల సమాచారంతో ఘటనాస్థలికి చేరుకున్న లక్ష్మీదేవిపల్లి పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం



చేసుకున్నారు. మృతుడి వద్ద లభించిన ఆధార్ కార్డు, ఫోన్ ఆధారంగా వివరాలు నిర్ధారించి కారేపల్లి పోలీసులకు సమాచారం అందించారు. కుటుంబ సభ్యులు, బంధువులు అక్కడికి చేరుకున్నారు. మృతిపై పలు అనుమానాలు వ్యక్తమవుతుండగా, శవ పరీక్ష నివేదిక అనంతరం పూర్తి వివరాలు వెల్లడిస్తామని చుంచుపల్లి సీఐ తెలిపారు.

# నీటి కష్టాలకు చెక్..!

- కుత్బుల్లాపూర్ సమస్యలపై వాటర్ వర్క్స్ ఎండీకి వినతి
- నిజాంపేట్‌తో పాటు పలు ప్రాంతాల తాగునీటి సమస్యలు అధికారుల దృష్టికి
- త్వరితగతిన పరిష్కారానికి చర్యలు చేపడతామని హామీ
- ఏడాదిలో తాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం: కొలన్ హన్మంత్ రెడ్డి



బాచుపల్లి, జూన్ 17 (విజన్ ఆంధ్ర): కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో నెలకొన్న తాగునీటి సమస్యల పరిష్కారానికి చర్యలు వేగవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి కోరారు. ఈ మేరకు స్థానిక నాయకులతో కలిసి వాటర్ వర్క్స్ మేనేజింగ్ డైరెక్టర్ అశోక్ రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు.

ఈ సందర్భంగా నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్‌తో పాటు కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. పలు కాలనీల్లో తాగునీటి సరఫరాలో ఏర్పడుతున్న అంతరాయాలు, పెరుగుతున్న డిమాండ్ కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టి, ప్రతి ఇంటికి సరిపడా తాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు.

వినతిపత్రంపై స్పందించిన వాటర్ వర్క్స్ అధికారులు సమస్యలను పరిశీలించి త్వరితగతిన పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు చేపడతామని హామీ ఇచ్చినట్లు హన్మంత్ రెడ్డి తెలిపారు.

అనంతరం బాచుపల్లిలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రజల ప్రాథమిక అవసరాల కల్పనకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. గతంలో ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులు ప్రస్తుతం వేగంగా పూర్తవుతున్నాయని పేర్కొన్నారు. కుత్బుల్లాపూర్ ప్రజలు నీటి కొరతతో ఇబ్బందులు పడకుండా చూడటం తమ బాధ్యత అని స్పష్టం చేసిన హన్మంత్ రెడ్డి, రాబోయే ఏడాది కాలంలో నియోజకవర్గంలో తాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు కృషి చేస్తామని తెలిపారు. ప్రతి కాలనీకి తగినంత తాగునీటి సరఫరా అందేలా ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికతో ముందుకు సాగుతున్నామని వెల్లడించారు.

ప్రజల సమస్యల పరిష్కారమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, అభివృద్ధి ఫలాలు ప్రతి కుటుంబానికి చేరేలా ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని ఆయన పేర్కొన్నారు.

## హరిత కార్యక్రమానికి మొక్కలు అందుబాటులో ఉంచాలి

### తోటపల్లి నర్సరీ, మామిడి తోటను పరిశీలించిన ఎంపీడీవో

హుస్నాబాద్ విజన్ ఆంధ్ర జూన్ 17 : సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండలంలోని తోటపల్లి నర్సరీతో పాటు పూసవేర్లపల్లిలో ఈజీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మామిడి తోటను బుధవారం రోజున మండల అభివృద్ధి అధికారి సురేష్ పరిశీలించారు. ఈ సందర్భంగా నర్సరీలో మొక్కల సంరక్షణ, నీటి సరఫరా,పరిశుభ్రత నిర్వహణపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. మొక్కలను నాణ్యంగా పెంచి గ్రామాల్లో చేపట్టే హరిత కార్యక్రమాలకు అందుబాటులో ఉంచాలని సూచించారు. అలాగే ఈజీఎస్ ద్వారా ఏర్పాటు చేసిన మామిడి తోటలో మొక్కల పెరుగుదల,సంరక్షణ చర్యలను పరిశీలించి, తోట అభివృద్ధికి అవసరమైన చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బంక చందు,ఏపీఓ పద్మ, ఉపసర్పంచ్‌ల ఫోరం జిల్లా అధ్యక్షుడు బొమ్మగాని రాజ్‌కుమార్ గౌడ్, నియోజకవర్గ స్పోర్ట్స్ ఇంచార్జ్ వెన్న రాజు, ఏఎంసీ డైరెక్టర్ పోతుగంటి బాలయ్య, గాంధీనగర్ మాజీ సర్పంచ్ బొంగోని శ్రీనివాస్, ఈజీఎస్ ఈసీ పరుశరాములు, కార్యదర్శి మహేందర్, ఫీల్డ్ అసిస్టెంట్ అన్నపూర్ణ, గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## వెంకటాపురం మండలం కు మహర్దశ..

# రూ.61 కోట్ల అభివృద్ధి పనులకు నిధులు

- రూ.44 కోట్లతో రహదారి విస్తరణ.. రూ.17 కోట్లతో సెంట్రల్ లైటింగ్

వెంకటాపురం, జూన్ 17 (విజన్ ఆంధ్ర ) ములుగు జిల్లా, భద్రాచలం నియోజకవర్గం వెంకటాపురం మండలానికి రాష్ట్ర ప్రభుత్వం భారీగా నిధులు మంజూరు చేయడంతో అభివృద్ధికి కొత్త ఊపు రానుందని భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకటరావు తెలిపారు. బుధవారం వెంకటాపురం మండలంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు, వెంకటాపురం–చర్ల జాతీయ రహదారి నంబర్–12 మరమ్మతులు, విస్తరణ పనుల కోసం కిలోమీటరుకు రూ.1 కోటి చొప్పున మొత్తం రూ.44 కోట్లు మంజూరయ్యాయని వెల్లడించారు. అలాగే అర్బన్ క్యారెక్టర్ కలిగిన వెంకటాపురం మండల కేంద్రంలో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు కోసం రూ.17 కోట్లు మంజూరు చేసినట్లు చెప్పారు. గిరిజన ప్రాంత ప్రజలు ఎదుర్కొంటున్న రవాణా సమస్యలు, దెబ్బతిన్న రహదారుల పరిస్థితిని మంత్రి సీతక్కతో కలిసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా ప్రభుత్వం వెంటనే స్పందించి నిధులు విడుదల చేస్తూ జీవో జారీ చేసిందన్నారు. రహదారి దెబ్బతినడంతో భద్రాచలం వెళ్లేందుకు ప్రజలు ఏటూరునాగారం–మణుగూరు మార్గాన్ని ఆశ్రయించాల్సిన పరిస్థితి ఉండేదని, ఇప్పుడు ఆ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించనుందని పేర్కొన్నారు. గత పంచాయతీ ఎన్నికల సమయంలో మంత్రి సీతక్క, తాను ఇచ్చిన హామీ మేరకు వెంకటాపురానికి సెంట్రల్ లైటింగ్ మంజూరైందన్నారు. ఆలుబాక పంచాయతీ ముత్తారం గ్రామానికి వెళ్లే మార్గంలోని వాగుపై కల్వర్టు నిర్మాణానికి రూ.16 లక్షలు, బలహీనపడిన వంతెన వద్ద డైవర్షన్ రోడ్డు నిర్మాణానికి రూ.65 లక్షలు మంజూరయ్యాయని తెలిపారు. ఆదివాసీ గ్రామాల్లో మట్టి రోడ్లు లేకుండా సిమెంట్ రోడ్లు నిర్మించాలనే లక్ష్యంతో ఐటీడీఏ ద్వారా రూ.4 కోట్లు కేటాయించినట్లు చెప్పారు. టెండర్ ప్రక్రియ పూర్తికాగానే పనులు ప్రారంభిస్తామని వెల్లడించారు. భద్రాచలం నియోజకవర్గంలో రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల అదనపు కోటా పెంపుపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించిందని, అర్హులైన పేదలందరికీ దశలవారీగా ఇళ్లు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి ప్రాంత సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంలో కీలక పాత్ర పోషించారని ఎమ్మెల్యే అభినందించారు. సమావేశంలో పీఏసీఎస్ చైర్మన్ చిడెం మోహన్‌రావు, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సయ్యద్ హుస్సేన్, యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు చిట్టెం సాయి, కాంగ్రెస్ నాయకులు గుండమల్ల కిరణ్, జి.నాగేశ్వరరావు, దర్రా రవి తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సీ బాలికల హాస్టల్‌కు నూతన లైబ్రరీ భవనం కేటాయించాలి

## ఎస్ఎఫ్ఐ చేవెళ్ల డివిజన్ కార్యదర్శి అరుణ్ కుమార్

చేవెళ్ల, జూన్ 17 (విజన్ ఆంధ్ర) : పేద విద్యార్థినుల విద్యాభ్యాసానికి ఎలాంటి ఆటంకాలు కలగకుండా నూతనంగా నిర్మిస్తున్న లైబ్రరీ భవనాన్ని ఎస్సీ బాలికల కళాశాల హాస్టల్‌కు కేటాయించాలని ఎస్ఎఫ్ఐ చేవెళ్ల డివిజన్ కార్యదర్శి బేగరి అరుణ్ కుమార్ కోరారు. భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో చేవెళ్ల పట్టణంలో నూతనంగా నిర్మిస్తున్న లైబ్రరీ భవనాన్ని ఎస్సీ బాలికల కళాశాల హాస్టల్‌గా వినియోగించాలని కోరుతూ.. మండల కార్యదర్శి మాల చందు తో కలిసి బుధవారం ఆర్డీఓకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... 2018లో మంజూరైన ఎస్సీ బాలుర, బాలికల కళాశాల హాస్టళ్లు ఇప్పటికీ అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయని తెలిపారు. అద్దె బిల్లుల చెల్లింపుల్లో జాప్యం కారణంగా భవన యజమానులు హాస్టళ్ల నిర్వహణకు భవనాలు ఇవ్వడానికి ఆసక్తి చూపడం లేదన్నారు. దీంతో విద్యార్థులు తరచూ వసతి సమస్యలను ఎదుర్కొంటూ చదువులపై దృష్టి సారించలేని పరిస్థితి నెలకొంటోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు చెందిన విద్యార్థులకు ప్రభుత్వ వసతి గృహాలు ఎంతో అవసరమని పేర్కొన్నారు. చేవెళ్ల ఎస్సీ నియోజకవర్గం అయినప్పటికీ విద్యార్థులకు శాశ్వత వసతి సదుపాయాలు కల్పించడంలో నిర్లక్ష్యం కొనసాగుతోందని విమర్శించారు. స్థానిక ప్రజాప్రతినిధులు వెంటనే స్పందించి ఎస్సీ బాలికల హాస్టల్ భవన నిర్మాణానికి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అప్పటి వరకు నూతన లైబ్రరీ భవనాన్ని హాస్టల్ అవసరాలకు కేటాయించాలని కోరారు. విద్యార్థుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం చొరవ చూపకపోతే ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

# ఓటరు జాబితాల ప్రత్యేక సమీక్షపై అపోహలు వద్దు

## -డా. మల్గారి వైభవ్ రెడ్డి



చేవెళ్ళ, జూన్ 17 (విజన్ ఆంధ్ర) : ర్హులైన ప్రతి పౌరుడు ఓటరుగా నమోదు కావడమే ప్రత్యేక సమీక్ష లక్ష్యం అని బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డా. మల్గారి వైభవ్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఆయన 'విజన్ ఆంధ్ర'తో మాట్లాడుతూ... ఓటరు జాబితాల ప్రత్యేక సమగ్ర పునఃపరిశీలన ప్రక్రియపై కొందరు రాజకీయ పార్టీలు చేస్తున్న దుష్ప్రచారాన్ని ప్రజలు నమ్మవద్దని అన్నారు. భారత ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం ఓటరు జాబితాలను మరింత పారదర్శకంగా, ఖచ్చితంగా రూపొందించేందుకు చేపడుతున్న సాధారణ ఎన్నికల ప్రక్రియలో భాగమని తెలిపారు. ఇంటింటి ధృవీకరణ ద్వారా అర్హులైన కొత్త ఓటర్ల నమోదు, మరణించిన వారి పేర్ల తొలగింపు, ద్వంద్వ నమోదుల గుర్తింపు, వివరాల సవరణ వంటి అంశాలను పరిశీలిస్తారని వివరించారు. ప్రజల మద్దతు కోల్పోయిన కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు రాజకీయ లబ్ధి కోసం తప్పుడు ప్రచారానికి పాల్పడుతున్నాయని విమర్శించారు. ఎన్నికల అధికారులు, బూత్ స్థాయి సిబ్బంది వివరాల సేకరణకు వచ్చినప్పుడు అవసరమైన సమాచారం అందించి సహకరించాలని కోరారు. ప్రతి అర్హ భారతీయ పౌరుడి ఓటు హక్కును పరిరక్షించడంతో పాటు అనర్హుల పేర్లు జాబితాలో చేరకుండా చూడడమే ఈ ప్రక్రియ ప్రధాన ఉద్దేశమని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థను బలోపేతం చేయడంలో ఓటరు జాబితాల పరిశుద్ధత కీలకమని, ప్రతి అర్హుడు తన పేరు ఓటరు జాబితాలో నమోదైందో లేదో నిర్ధారించుకోవాలని వైభవ్ రెడ్డి పిలుపునిచ్చారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే మా లక్ష్యం: మాజీ ఎమ్మెల్యే కె.ఎస్. రత్నం

**- ఎంపీ నిధులతో రూ.10 లక్షల వ్యయంతో అభివృద్ధి కార్యక్రమం ప్రారంభం**

**- హౌసింగ్ బోర్డు కాలనీలో సీసీ రోడ్డు పనులకు శ్రీకారం**



చేవెళ్ల, జూన్ 17 (విజన్ ఆంధ్ర): ప్రజా సమస్యల పరిష్కారమే తమ లక్ష్యమని మాజీ ఎమ్మెల్యే కె.ఎస్. రత్నం పేర్కొన్నారు. చేవెళ్ల పట్టణంలోని 12వ వార్డు హౌసింగ్ బోర్డ్ కాలనీలో ఎంపీ నిధులు రూ.10 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను బుధవారం రాష్ట్ర నాయకులు అంజన్ కుమార్ గౌడ్, కంజర్ల ప్రకాష్, ప్రభాకర్ రెడ్డి, శ్రీశైలం, సామ మాణిక్య రెడ్డి, కుంచం శ్రీనివాస్, డా.మల్గారి వైభవ్ రెడ్డి, ఆంజనేయులు గౌడ్, దేవుని శర్వలింగం, 12వ వార్డు కౌన్సిలర్ అతెల్లి మనీషాఅనంత్ రెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కె.ఎస్. రత్నం మాట్లాడుతూ... కాలనీల అభివృద్ధి, ప్రజల సౌకర్యాల పెంపుదల లక్ష్యంగా పలు కార్యక్రమాలు అమలు చేస్తున్నామని తెలిపారు. రహదారులు, డ్రైనేజీలు, ఇతర మౌలిక వసతుల అభివృద్ధికి నిరంతరం కృషి కొనసాగుతోందన్నారు.స్థానిక సమస్యల పరిష్కారంలో ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందని సూచించారు. అనంతరం కౌన్సిలర్ మనీషాఅనంత్ రెడ్డి మాట్లాడుతూ... కాలనీవాసులు ఎదుర్కొంటున్న రహదారి సమస్యను తమ దృష్టికి తీసుకురావడంతో వెంటనే స్పందించి ఎంపీ నిధుల ద్వారా నిధులు మంజూరు చేయించామని చెప్పారు. సీసీ రోడ్డు నిర్మాణం పూర్తయితే రాకపోకలు సులభతరం కావడంతో పాటు వర్షాకాలంలో ఇబ్బందులు గణనీయంగా తగ్గనున్నాయని వివరించారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను దశలవారీగా అమలు చేస్తున్నామని, 12వ వార్డు సమగ్ర అభివృద్ధికి అంకితభావంతో పనిచేస్తానని స్పష్టం చేశారు. ప్రజల సహకారంతో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ చేవెళ్ల బీజేపీ కౌన్సిలర్స్ పెద్దోళ్ల దయాకర్, మీనాక్షిసత్యనారాయణ. బీజేపీ నాయకులు పత్తి సత్యనారాయణ, అగ్రపల్లి అశోక్, ఇంద్రసేన రెడ్డి, మహేందర్, అభిలాష్ బాబు, జయసింహారెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, వెంకటేష్ పాగ, మల్గారి మధుకర్ రెడ్డి, గాజుల గూడెం శ్రీనివాస్ రెడ్డి, పీసరి శ్రీకాంత్ రెడ్డి, శేఖర్ రెడ్డి, వడ్డే గణేష్, పురుషోతం రెడ్డి, అభిశేఖర్ రెడ్డి, మహేష్, చాకలి శ్రీనివాస్, కాలనీ వాసులు గంగి యాదయ్య, రామస్వామి, ప్రకాష్ గౌడ్, హరి, శ్రీధర్ రెడ్డి, గోపాల్ రెడ్డి, దశరథ్ తదితరులు పాల్గొన్నారు.

# శానిటేషన్ జవాన్‌ను పరామర్శించిన మున్సిపల్ కమిషనర్

కల్లూరు, జూన్ 17(విజన్ ఆంధ్ర) : మున్సిపాలిటీ పరిధిలో విధులు నిర్వహిస్తున్న శానిటేషన్ జవాన్ ఊడల కృష్ణ ప్రమాదవశాత్తు గాయపడడంతో మున్సిపల్ కమిషనర్ జి సాయి కృష్ణారెడ్డి ఆయనను పరామర్శించారు. విధి నిర్వహణలో భాగంగా జరిగిన ప్రమాదంలో ఊడల కృష్ణ కుడి చేతి భుజానికి దెబ్బ తగలగా విషయం తెలుసుకున్న కమిషనర్ వెంటనే స్పందించి ఆయన ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. ఈ సందర్భంగా హాస్పటల్ వైద్యుల తో మాట్లాడి అవసరమైన వైద్య చికిత్స అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. మున్సిపాలిటీ అభివృద్ధి మరియు ప్రజారోగ్య పరిరక్షణలో శానిటేషన్ సిబ్బంది కీలక పాత్ర పోషిస్తున్నారని, విధి నిర్వహణలో వారి భద్రతకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తామని కమిషనర్ తెలిపారు. ఉద్యోగులు ఆరోగ్యం విషయంలో ఎటువంటి నిర్లక్ష్యం చేయకుండా అవసరమైన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. మున్సిపాలిటీ సిబ్బంది సంక్షేమం పట్ల యాజమాన్యం ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని ఈ సందర్భంగా కమిషనర్ పేర్కొన్నారు.

# అక్షరాభ్యాసం మరియు పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న సంగెం గ్రామ సర్పంచ్ గన్నోజు వేణుగోపాల చారి

కేశంపేట, విజన్ ఆంధ్ర 18 : మండల పరిధిలోని సంగెం గ్రామంలో అక్షర వ్యాసం మరియు పాఠ్యపుస్తకాల పంపిణీ కార్యక్రమం సంగెం గ్రామ సర్పంచ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. గ్రామంలోని చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించి విద్య యొక్క ప్రాముఖ్యతను వివరించారు. విద్యార్థుల్లో చదువుపై ఆసక్తిని పెంపొందించేందుకు నోట్ బుక్స్ పాఠ్యపుస్తకాలు మరియు ఇతర విద్యా సామాగ్రిని పంపిణీ చేశారు. గ్రామ పెద్దలు తల్లిదండ్రులు మరియు ప్రజా ప్రతినిధులు పాల్గొని విద్యార్థులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ విద్య జీవితానికి బలమైన పునాది అని ప్రతి విద్యార్థి ఉన్నత విద్యను అభ్యసించి గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. విద్యలు రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరుతూ ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు ఈ కార్యక్రమంలో పాల్గొన్న సంఘం గ్రామ సర్పంచ్ గన్నోజు వేణుగోపాల చారి మరియు ఉప సర్పంచ్ షకీల్ గ్రామ పంచాయతీ సెక్రటరీ సందీప్ ఉపాధ్యాయులు గ్రామస్తులు పాల్గొన్నారు.

# నెల్లుట్ల గ్రామంలో ఇందిరమ్మ ఇల్లు వెరిఫికేషన్ ప్రక్రియ

లింగాల గణపురం జూన్ 17(విజన్ ఆంధ్ర) జనగామ జిల్లా లింగాల గణపురం మండలంలోని నెల్లుట్ల గ్రామంలో ఇందిరమ్మ ఇల్లు వెరిఫికేషన్ ప్రక్రియ గ్రామ సర్పంచ్ నర్సింగ రామకృష్ణ మరియు ఇరిగేషన్ ఏఈ కిషోర్, హౌసింగ్ ఏఈ కార్తీక్ ఉపసర్పంచ్ దామెర కావ్య ప్రభాకర్,గ్రామపంచాయతి కార్యదర్శి అనిల్ రాజ్,వార్డ్ మెంబర్స్ గొరిగె సందీప్, నల్ల విల్సన్, బొజ్జం సునీత ప్రభాకర్,నల్ల అజయ్,కారాబార్ చెరుకు అజయ్, తదితరులు పాల్గొన్నారు



## కల్లూరు మున్సిపాలిటీలో సీజనల్ వ్యాధుల నివారణకు స్పెషల్ శానిటేషన్ డ్రైవ్



కల్లూరు, జూన్ 17 (విజన్ అంధ్ర) : మున్సిపాలిటీ చైర్మన్ మోహన్ నాయక్ అధ్యక్షతన, మున్సిపల్ కమిషనర్ జి సాయి కృష్ణారెడ్డి మరియు 17వ వార్డు కౌన్సిలర్ కనపర్తి శ్యామల ఆధ్వర్యంలో బుధవారం మున్సిపాలిటీ పరిధిలోని అంబేద్కర్ నగర్ కాలనీలో ప్రత్యేక శానిటేషన్ అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఇటీవల గత కాలంలో డెంగ్యూ కేసులు నమోదైన ప్రాంతాలను గుర్తించి, ప్రస్తుత వర్షాకాల పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని సీజనల్ వ్యాధులు ప్రజల్లో ప్రబలకుండా ఉండేందుకు ముందస్తు నివారణ చర్యల్లో భాగంగా ఈ ప్రత్యేక డ్రైవ్ చేపట్టబడింది. ఈ కార్యక్రమంలో భాగంగా కాలనీలో పేరుకుపోయిన చెత్తను తొలగించడం, నీరు నిల్వ ఉండే ప్రదేశాలను గుర్తించి శుభ్రపరచడం, దోమల వ్యాప్తి నివారణకు యాంటీ లార్వా మందుల పిచికారీ నిర్వహించడం, మురుగు కాలువలను శుభ్రపరచడం వంటి చర్యలు చేపట్టడం జరిగింది. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ ప్రజలు తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం, నీరు నిల్వ కాకుండా జాగ్రత్తలు తీసుకోవడం, దోమల వ్యాప్తిని అరికట్టడంలో ప్రజల భాగస్వామ్యం ఎంతో ముఖ్యమని తెలిపారు. డెంగ్యూ, మలేరియా, చికున్‌గున్యా వంటి వ్యాధుల నివారణకు మున్సిపాలిటీ ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికతో ముందుకు సాగుతోందని పేర్కొన్నారు.

అలాగే ప్రజారోగ్య పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తూ, ప్రతి వార్డులో అవసరమైన చోట్ల ప్రత్యేక శానిటేషన్ డ్రైవ్‌లు నిరంతరం నిర్వహించబడతాయని, ప్రజలు కూడా మున్సిపాలిటీ సిబ్బందికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ శీలం కోటేశ్వరి కృష్ణారెడ్డి, ఉబ్బన రాంబాబు , యాసా శ్రీకాంత్ శానిటరీ ఇన్స్పెక్టర్ రమేష్,మున్సిపల్ సిబ్బంది, శానిటేషన్ కార్మికులు, వార్డు సిబ్బంది మరియు స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## అవగాహన సదస్సు ఇంటింటా సర్వే నిర్వహించాలని మెదక్ ఆర్డీఓ రమాదేవి

చిన్న శంకరంపేట మండలం మోడల్ హైస్కూల్లో బి ఎల్ వోస్ అధికారులకు మరియు వివిధ పార్టీలకు చెందిన బూతులు ఏజెంట్లకు అవగాహన కల్పించడం జరిగింది కార్యక్రమానికి మెదక్ ఆర్డిఓ రమాదేవి ముఖ్యఅతిథిగా పాల్గొని బి ఎల్ ఓ లకు ఎస్పై ఆర్ ఐ లకు కిట్లను అందజేశారు ఈ సందర్భంగా ఆర్డీవో రమాదేవి మాట్లాడుతూ ఈనెల 25 నుండి వచ్చే నెల 24వ తేదీ వరకు బిఎల్ఓ లు ప్రతి ఇంటిని సందర్శించి కమిషన్ సూచించిన తేదీ నాటికి ప్రస్తుతం ఓటర్ వివరాలతో కూడిన ఫారం లో పంపిణీ చేయాలని అదేవిధంగా వారికి మార్గ నిర్దేశం చేయాలని సూచించారు నూతన ఓటర్ లిస్ట్ లో పేరు నమోదు చేసుకోవడానికి ఫార్మా నెంబర్ 6 నింపాలని ఓటర్ లిస్టులో ఏవైనా సవరణ చేయాలనుకున్న ఫారం నెంబర్ 8 లో పూర్తిచేసి తీసుకోవాలని బి ఎల్ ఏ ల సాకారంతో ఎస్ఐ ఆర్ఐ లు పూర్తి చేసుకోవడానికి ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తేవాలని



అవసరమైతే గ్రామంలో సమావేశం ఏర్పాటు చేసుకొని పరిష్కరించుకోవాలని ఆర్డిఓ రమాదేవి తెలిపారు ఈ కార్యక్రమంలో తాసిల్దార్ మాలతి ఆర్ ఐ లు ఇన్స్పెక్టర్ రాజు వినయ్ తో పాటు బిఎల్ఓ లు పార్టీల బూత్ కమిటీ ఏజెంట్లు తదితరులు పాల్గొన్నారు

## మద్యం షాపుల జోరు

### ముల్కనూర్ లో ఎన్ని మద్యం షాపులు ఉన్నాయి

### బెల్టు షాపుల కోసం పనిచేసే మద్యం షాపులు ఎన్ని ?

### అబ్కారీ శాఖ కాగితాలకే పరిమితమైన మద్యం దుకాణం ?

### ఏ జిల్లాలో లేని విధంగా హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ముల్కనూర్ లో కొనసాగుతున్న దందా

భీమదేవరపల్లి ( విజన్ ఆంధ్ర) జూన్ 17 భీమదేవరపల్లి మండలం ముల్కనూర్ లో మద్యం షాపుల వేలం పాటలు మూడు ఉన్నట్టు వేలం జరిగింది కానీ ఎక్కడా లేని విధంగా రెండు మద్యం షాపులు మాత్రమే నడుస్తున్నాయి మూడో మద్యం షాప్ ఎక్కడికి వెళ్లింది ?ఎలా మాయమైంది?

మూడో మద్యం షాప్ బహిరంగంగానే కేవలంబెల్ట్ షాపులకు మాత్రమే మద్యం సరఫరా చేయడానికి వినియోగిస్తున్నారు. భీమదేవరపల్లి మండలంలో ఉన్న గ్రామాలన్నీ మద్యం బెల్ట్ షాపుల్ని వద్దంటున్న ఏకగ్రీవ తీర్మానం చేస్తు ఆదర్శంగా నిలుస్తుంటే ముల్కనూర్ పాలక వర్గం మాత్రం మద్యం బెల్టు షాపులను అలానే కొనసాగిస్తున్నారు. దీనికి కారణం పాలకవర్గంలోని కొంతమంది సభ్యులు బెల్ట్ షాపులు నిర్వహించడమే కారణమా?అబ్కారీ శాఖ ఈ అక్రమాలను అరికట్టడంలో విఫలమయ్యారని ప్రజలు విమర్శిస్తున్నారు. ప్రతి మద్యం షాప్ ఉదయం 10 గంటల నుండి రాత్రి 10 గంటల వరకు తెరిచి ఉండాలి కానీ బెల్టు షాపుల అమ్మకాల కోసం ఇక్కడున్న మద్యం షాపులు ఉదయం 10 గంటల నుండి రాత్రి 9 గంటల వరకే నడుపుతున్నారు. ఇక్కడున్న అధికారులు అన్నీ తెలిసినా కూడా మౌనం గా ఉండడం విమర్శలకు గురిచేస్తుంది. ఎక్కడైనా మద్యం షాపులు బడి గుడి మసీదు చర్చికి 100 మీటర్లు దూరం ఉండాలి కానీ ఇక్కడున్న బెల్ట్ షాపులకి ఇలాంటి నియమాలు వర్తించడం లేదు. ముల్కనూర్ లో జడ్పీహెచ్ఎస్ హైస్కూల్ దగ్గర మరియు బాలికల వసతి గృహం దగ్గర ఇలాంటి బెల్ట్ షాపులు నిర్వహిస్తున్న కూడా పాలకవర్గం కానీ దానికి సంబంధించిన అధికారులు కానీ ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు.

## విద్యా వికాసం కోసమే "తెలంగాణ పబ్లిక్ స్కూల్స్"

తెలంగాణ పబ్లిక్ స్కూల్ కేవలం ఆరుట్ల గ్రామానికి, ఇబ్రహీంపట్నం నియోజకవర్గానికి మాత్రమే స్ఫూర్తి కాదని, తెలంగాణలోని 27 లక్షల మంది ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఇది స్ఫూర్తిగా నిలుస్తుందన్నారు. ఆరుట్ల తెలంగాణ పబ్లిక్ స్కూల్ లో ఇప్పటికే 1,814 మంది విద్యార్థులు చేరారని, ఒక ప్రభుత్వ పాఠశాలకు నో అడ్మిషన్ బోర్డు పెట్టే పరిస్థితి ఉందంటే విద్యా ప్రమాణాల్లో ప్రభుత్వ చిత్తశుద్ధి ఎలాంటిదో స్పష్టమవుతోందని చెప్పారు. ఈ సందర్భంగా మెరుగైన విద్యను అందిస్తూ ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్ల పెరిగేందుకు కృషి చేస్తున్న ఉపాధ్యాయులను ముఖ్యమంత్రి అభినందించారు.

తెలంగాణలో ప్రతీ శాసన సభ నియోజకవర్గంలో ఒక తెలంగాణ పబ్లిక్ స్కూల్ ను ఏర్పాటు చేసే యోచనలో ప్రభుత్వం ఉందని, ఈ స్కూల్స్ ద్వారా వచ్చే ఫలితాలు, సమస్యలను అవగాహన చేసుకుని రాష్ట్రంలో మరిన్ని తెలంగాణ పబ్లిక్ స్కూళ్లను ఏర్పాటుపై ముందుకు వెళతామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. మట్టిలో మాణిక్యాలను వెలికి తీసేందుకే ప్రభుత్వ పాఠశాలలను పునరుద్ధరిస్తున్నామని, ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకున్న వారు ఎందరో గొప్ప నాయకులుగా, అధికారులుగా ఎదిగారని చెప్పారు. మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు ప్రభుత్వ బడిలో చదువుకున్నవారేనని, తాను కూడా ప్రభుత్వ పాఠశాలలో చదువుకుని ముఖ్యమంత్రి స్థాయికి చేరుకున్నానని గుర్తు చేశారు. తల్లిదండ్రులు ఆత్మగౌరవంతో బ్రతికేలా విద్యార్థులంతా విద్యలో రాణించాలని సూచించారు. ఐఏఎస్ లు, ఐపీఎస్ లు, అధికారులుగా, రాజకీయ నాయకులుగా విద్యార్థులు ఎదగాలని ఆకాంక్షించారు. విద్యా వ్యవస్థను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం ఎన్నో విప్లవాత్మక నిర్ణయాలు తీసుకుందని సీఎం గుర్తు చేశారు. విద్యార్థులకు నాణ్యమైన యూనిఫాంతో పాటు కిట్స్ ను అందిచే ప్రణాళికతో ప్రభుత్వం ముందుకు వెళుతోందన్నారు. విద్యార్థుల మధ్య కుల వివక్షను దూరం చేసేందుకు యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. విద్యార్థులకు నైపుణ్య శిక్షణ అందించేందుకు యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేశామని, డిసెంబరు 9 న యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ భవనాన్ని ప్రారంభించుకోబోతున్నట్లు సీఎం వెల్లడించారు. ఒలింపిక్స్ లక్ష్యంగా యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేశామని, ఇందుకోసం విద్యార్థులకు క్రీడల్లో శిక్షణ అందించే కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. క్రీడలను ప్రోత్సహించడంలో భాగంగా ఫుట్ బాల్ దిగ్గజం మెస్సీని హైదరాబాద్ నగరానికి తీసుకువచ్చి విద్యార్థులతో ఫుట్ బాల్ ఆడించామని తెలిపారు. దీనిపై కొందరు రాజకీయ విమర్శలు చేశారని, కడుపులో కుల్లు పెట్టుకుని రాజకీయం చేయాలనుకుంటున్న వాళ్లకు భవిష్యత్ లో ప్రజలు ప్రతిపక్ష హోదా కూడా మిగల్చరని హెచ్చరించారు. విమర్శించే వాళ్లకు ఆరుట్ల తెలంగాణ పబ్లిక్ స్కూల్ ను చూపించాలని పిలుపునిచ్చారు. ప్రజా ప్రభుత్వానికి అంతా అండగా నిలిస్తే అద్భుతాలని సృష్టిస్తామని, తెలంగాణను దేశానికి రోల్ మోడల్ గా తీర్చి దిద్దుతామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి మంత్రి శ్రీధర్ బాబు, ప్రభుత్వ సలహాదారు కే.కేశవరావు, ఎంపీలు వేం నరేందర్ రెడ్డి, రఘువీర్ రెడ్డి, శాసన మండలి చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, ఎమ్మెల్యేలు మల్ రెడ్డి రంగారెడ్డి, యెన్నం శ్రీనివాస్ రెడ్డి, విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి, సభ్యులు, వివిధ కార్పోరేషన్ల చైర్మన్లు పాల్గొన్నారు.

### హెలిప్యాడ్ నుంచి స్కూల్ బస్సులో...

తెలంగాణ ప్రభుత్వం ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన తెలంగాణ పబ్లిక్ స్కూల్ బస్సును ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరిశీలించారు. హెలికాప్టర్ నుంచి దిగిన అనంతరం మంత్రి శ్రీధర్ బాబు, ఎంపీలు, ఎమ్మెల్యేలతో కలిసి హెలిప్యాడ్ నుంచి స్కూల్ ప్రాంగణం వరకు స్కూల్ బస్సులోనే ప్రయాణించారు. స్కూల్ ప్రాంగణానికి చేరుకున్న అనంతరం పైలాన్ ఆవిష్కరించి స్కూల్ మేనేజ్ మెంట్ కమిటీలతో సంభాషించారు. థాంక్యూ సీఎం అంటూ తనకు స్వాగతం పలికిన విద్యార్థులను ఆప్యాయంగా పలకరించారు.

### పూరీ చేసి.. కిచెన్ ను పరిశీలించి...

విద్యార్థులతో కలిసి బ్రేక్ ఫాస్ట్ చేసిన సీఎం, బ్రేక్ ఫాస్ట్ తయారు చేసే కిచెన్ పరిశీలించారు. నేను మీలా పూరీ చేయగలనా అంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పూరీ చేసి వంట చేసే మహిళలతో సరదాగా సంభాషించారు. అనంతరం ప్రీ-ప్రైమరీ తరగతి గదులను సందర్శించి చైల్డ్ లెర్నింగ్ యాక్టివిటీని సీఎం పరిశీలించారు. పాఠశాలలో లైబ్రరీ, తరగతి గదులు, ఇన్నోవేషన్ ల్యాబ్, ఫిజిక్స్, బాటనీ, కెమిస్ట్రీ ల్యాబ్స్ ను సందర్శించారు.

### జామ మొక్కను నాటిన సీఎం

తెలంగాణ పబ్లిక్ స్కూల్ ప్రారంభోత్సవం సందర్భంగా పాఠశాల ఆవరణలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జామ మొక్కను నాటారు. అనంతరం డాన్స్, మ్యూజిక్ రూమ్ ను సందర్శించి అక్కడి యాక్టివిటీని తెలుసుకున్నారు. అటు నుంచి ఫుట్ బాల్ గ్రౌండ్ కు వెళ్లి విద్యార్థులతో కాసేపు ఫుట్ బాల్ ఆడారు. అనంతరం బహిరంగ సభకు చేరుకుని విద్యార్థులు, స్థానికులను ఉద్దేశించి ప్రసంగించారు.

# పోలీస్ స్టేషన్ ను సందర్శించిన జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్

**- స్టేషన్ ఆవరణంలో మొక్కను నాటిన ఎస్పీ**

**- నిఘా వ్యవస్తా పటిష్టం కోసం ప్రతి గ్రామంలో సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలి.**

**- సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలి.**

అందోల్ /సంగారెడ్డి జూన్ 17(విజన్ ఆంధ్ర ): వట్ పల్లి మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ ను సంగారెడ్డి జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ పర్యటించి స్టేషన్ రికార్డులను పరిశీలించారు.అనంతరం స్టేషన్ పరిసరాల పరిశుభ్రతను పరిశీలించి,ఆవరణంలో మొక్కను నాటి నీరుపోశారు.ఈ సందర్బంగా ఎస్పీ మాట్లాడుతూ సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు.అలాగే ప్రతి గ్రామంలో నిఘా వ్యవస్తా పటిష్టత కోసం సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలని తెలిపారు.పోలీస్ కిట్టును జాగ్రత్తగా చూసుకోవాలని అన్నారు.నేర చరిత్ర కలిగిన ప్రాంతాలను గుర్తించి బ్లాక్ స్పాట్లుగా గుర్తించి పగలు



- రాత్రి బిట్లను నిర్వహించాలని అన్నారు. వట్ పల్లి ఎస్సై శ్రీహరి,పోలీస్ సిబ్బంది పనితీరు బాగుందని అన్నారు.ఈ కార్యక్రమంలో డీఎస్పీ సత్యయ్య గౌడ్, జోగిపేట సీఐ అనిల్ కుమార్,ఎస్సై శ్రీహరి,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ముద్దాయి పేట శివారులో అక్రమ చెట్ల నరికివేతపై ఫారెస్ట్ అధికారుల చర్యలు

చౌటకూర్ జూన్ 17 (విజన్ ఆంధ్ర ):- పుల్కల్ మండలంలోని ముద్దాయిపేట గ్రామ శివారులో అక్రమంగా చెట్లను నరికి తరలిస్తున్నారనే సమాచారం అందడంతో అటవీ శాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. ఈ మేరకు చింత, ఇప్ప చెట్ల కట్టెల లోడుతో వెళ్తున్న ఒక ట్రాక్టర్‌ను అధికారులు అడ్డుకుని స్వాధీనం చేసుకుని ఫారెస్ట్ కార్యాలయానికి తరలించారు.ప్రభుత్వ అనుమతి లేకుండా పచ్చని చెట్లను నరికివేయడం చట్టవిరుద్ధమని అధికారులు స్పష్టం చేశారు. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతుండగా, కొందరు దళారులు అక్రమంగా చెట్లను నరికి విక్రయించడం ఆందోళన కలిగించే విషయమని పేర్కొన్నారు.అనుమతి లేకుండా ఎలాంటి చెట్లను నరికినా సంబంధిత వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు కేసులు నమోదు చేస్తామని అటవీ శాఖ అధికారులు హెచ్చరించారు. అయినప్పటికీ కొందరు వ్యక్తులు అధికారుల హెచ్చరికలను పట్టించుకోకుండా చెట్లను నరికి దళారులకు



విక్రయిస్తున్నారని వెల్లడించారు.

అక్రమ చెట్ల నరికివేతను అరికట్టేందుకు అటవీ ప్రాంతాల్లో నిఘా మరింత పెంచాలని, ఇటువంటి చర్యలకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. పర్యావరణానికి ముప్పుగా మారుతున్న అక్రమ చెట్ల నరికివేతను పూర్తిగా అడ్డుకోవాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# మున్నూరు కాపు ట్రస్ట్ భవనానికి రూ..5 కోట్లు

## -మంత్రి పొన్నం ప్రభాకర్

**ఐకమత్యంతో ముందుకు సాగితే మున్నూరు కాపుల హక్కులు సాధించవచ్చు హన్మంతరావు**

**కార్యక్రమ విజయానికి సహకరించిన అందరికీ కృతజ్ఞతలు సర్దార్ పుట్ట పురుషోత్తం**

విజన్ ఆంధ్ర (17)హైదరాబాద్ : మున్నూరు కాపు ట్రస్ట్ భవన నిర్మాణానికి తొలి దశలో రూ.5 కోట్లు మంజూరు చేస్తున్నట్లు రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రకటించారు, తెలంగాణ రాష్ట్ర మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో రవీంద్ర భారతిలో జరిగిన మున్నూరు కాపు ప్రజా ప్రతినిధుల సన్మాన సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు, ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, బీసీల హక్కుల సాధన కోసం పోరాటం నిరంతరం కొనసాగాలని, పార్టీలకు అతీతంగా బీసీ కులాలు ఐక్యతను ప్రదర్శించాలని పిలుపునిచ్చారు, ప్రభుత్వం బీసీ కులాల ఆత్మగౌరవ భవనాల కోసం భూములు కేటాయించడం అభినంద నీయమని, ఆభవనాల నిర్మాణానికి నిధులు కేటాయించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు, సభలో పాల్గొన్న మాజీ రాజ్యసభ సభ్యుడు, ప్రభుత్వ సలహాదారు వి. హనుమంత రావు మాట్లాడుతూ, బీసీల అభ్యున్నతికి విద్యే ప్రధాన మార్గమని, మహాత్మా జ్యోతిరావు పూలే స్ఫూర్తితో బీసీ వర్గాలకు చెందిన యువత ఉన్నత విద్యను అభ్యసించి అన్ని రంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు, మున్నూరు కాపు కార్పొరేషన్ చైర్మన్ బొమ్మ శ్రీరామ్ మాట్లాడుతూ, మున్నూరు కాపు సమాజ అభివృద్ధికి ప్రభుత్వం మరింత సహకారం అందించాలని, ట్రస్ట్ భవన నిర్మాణంతో పాటు కార్పొరేషన్‌కు తగిన నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు, తెలంగాణ రాష్ట్ర మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడు పుట్ట పురుషోత్తం అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ మల్క కొమరయ్య, గజ్జి భాస్కర్, గాలి అనిల్ కుమార్, పెద్ది పెంటయ్య, బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి, ఇ.వి శ్రీనివాస్ రావు, అల్లం భాస్కర్, నాడెం శాంతి కుమార్, బొల్లం శివ, కాచం సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు, రాష్ట్రంలోని 33 జిల్లాల నుంచి వచ్చిన మున్నూరు కాపు సంఘాల ప్రతినిధులు, నాయకులు, ప్రజలు భారీ సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు





# మధిరలో కాంగ్రెస్ పార్టీ బిఎల్ఏలకు శిక్షణ శిబిరం

మధిర,జూన్17(విజన ఆంధ్ర )మధిర పట్టణంలోని శ్రీరస్తు ఫంక్షన్ హాల్‌లో బుధవారం టీపీసీసీ ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ల శ్రీనుబాబు ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ బిఎల్ఏలకు శిక్షణ శిబిరం నిర్వహించబడింది.ఈ సందర్భంగా దుద్దిళ్ల శ్రీనుబాబు మాట్లాడుతూ, ఎన్నికల ప్రక్రియలో బిఎల్ఏల పాత్ర అత్యంత కీలకమని, ఓటరు జాబితాల పరిశీలన, సవరణలు, అభ్యంతరాల నమోదు, అర్హులైన ప్రతి ఓటరిని జాబితాలో చేర్చే విషయంలో అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. భారత ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం పని చేస్తూ, పార్టీ బలోపేతానికి ప్రతి బిఎల్ఏ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఓటరు జాబితాలో ఎలాంటి పొరపాట్లు లేకుండా ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ ప్రజాస్వామ్య పరిరక్షణకు తోడ్పడాలని తెలిపారు.ఈ శిక్షణ శిబిరంలో మధిర పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు లితలుపుల వెంకటేశ్వర్లులి , మధిర మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పారుపల్లి విజయ్ కుమార్ , జిల్లా నాయకులు కర్నాటి రామారావు,చిట్టిబాబు కాంగ్రెస్ పార్టీ, బిఎల్ఏలు పాల్గొన్నారు.

# బూర్గంపాడు మండలం సారపాక గ్రామంలో కల్యాణలక్ష్మి - షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ



బూర్గంపాడు మండలం ప్రతినిధి జూన్ 17( విజన్ ఆంధ్ర ) బూర్గంపాడు మండలం సారపాక గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో బూర్గంపాడు మండలానికి చెందిన 34 మంది కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ లబ్ధిదారులకు రూ.34,03,944 విలువ గల చెక్కులను పినపాక నియోజకవర్గ శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు గారు అందజేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే గారు మాట్లాడుతూ, పేద కుటుంబాల ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక భరోసా కల్పించే కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాల్లో ముఖ్యమైనవని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి లబ్ధిదారునికి ప్రభుత్వ పథకాల ఫలాలు చేరేలా కృషి చేస్తామని తెలిపారు

“ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం -- అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందించడమే మా లక్ష్యం” అని ఎమ్మెల్యే శ్రీ పాయం వెంకటేశ్వర్లు



# అంగన్వాడీ లు,ప్రాథమిక పాఠశాలలు బలోపేతం చేయాలి

## - జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్

నర్సాపూర్ 17 జూన్ (విజన్ఆంధ్ర) నియోజకవర్గంలోని ప్రాథమిక పాఠశాలలు,అంగన్వాడీ లు మరింత బలోపేతం కావాలని అంగన్వాడీ,ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థుల నమోదు శాతాన్ని పెంచాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

బుధవారం నర్సాపూర్ మండలం రెడ్డిపల్లి గ్రామంలో అంగన్వాడీ ,ప్రాథమిక పాఠశాలలను డి ఆర్ డి ఓ, డీ ఈ ఓ,డి డబ్ల్యూ ఓ,గ్రామ సర్పంచ్ తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా బుధవారం నాడు కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రంలోని చిన్నారులతో సంభాషిస్తూ అనంతరం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా అంగన్వాడీ లు,ప్రాథమిక పాఠశాలలు మరింత బలోపేతం చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అంగన్వాడీ, ప్రీ ప్రైమరీ స్కూల్స్ ,ప్రభుత్వ పాఠశాలలో మౌలిక సదుపాయాలు,త్రాగు నీరు,టాయిలెట్స్,విద్యుత్ తో పాటు అన్ని సౌకర్యాలు కల్పించి విద్యార్థులకు ఆ సౌకర్యాలు లేకుండా చూడాలన్నారు. అంగన్వాడీ లలో ప్రీ ప్రైమరీ పాఠశాల లలో నమోదు శాతాన్ని పెంచాలని,తల్లితండ్రులు ప్రైవేట్ పాఠశాల ల వైపు మొగ్గు చూపకుండా ప్రభుత్వ పాఠశాలలలో పిల్లలను చేర్పించాలని స్పష్టం చేశారు.ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా తీర్చి దిద్దటమే ప్రభుత్వం లక్ష్యమన్నారు. అంగన్వాడీ టీచర్లు ,ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు సమన్వయంతో పని చేసి పాఠశాలల నమోదు శాతం పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యా శాఖ అధికారి రాజు,జిల్లా సంక్షేమ అధికారి హేమా భార్గవి, ఏ ఎం ఓ సుదర్శన్ మూర్తి, ఎం ఈ ఓ తార సింగ్,అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# దేశానికే ఆదర్శంగా నిలుస్తున్న తెలంగాణ సంక్షేమ పథకాలు

## -- ఎమ్మెల్యే కడియం శ్రీహరి



స్టేషన్ ఘన్‌పూర్, జూన్ 17, (విజన్ ఆంధ్ర) : తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని మాజీ ఉప ముఖ్యమంత్రి, ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. బుదవారం మండలం రంగరాయగూడెం, ఇప్పగూడెం గ్రామాలలో పలు అభివృద్ధి పనులు ప్రారంభించారు. రంగరాయగూడెం గ్రామంలో 33.48లక్షలతో నిర్మించనున్న సిసి రోడ్లు, మహిళా భవనం, ప్రాథమిక పాఠశాల ప్రహారీ గోడ నిర్మాణానికి శంకుస్థాపన, ఇందిరమ్మ ఇండ్ల ప్రారంభోత్సవంతో పాటు 8మంది ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాలను పంపిణి చేశారు. ఇప్పగూడెం గ్రామంలో కోటి 10లక్షలతో నిర్మించిన సిసి రోడ్లు, ఇందిరమ్మ ఇండ్లు ప్రారంభోత్సవం, కోటి 23లక్షల కూడా నిధులతో నిర్మించనున్న సిసి రోడ్డు పనులకు శంకుస్థాపన, 40మంది ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాలను పంపిణి చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశాలలో ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ అభివృద్ధి సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని అన్నారు. రాజకీయాలకు అతీతంగా గ్రామాల అభివృద్ధికి ప్రతీ ఒక్కరు సహకరించాలని కోరారు. రంగరాయగూడెం గ్రామంలో కోటి 50లక్షలతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు వెల్లడించారు. గ్రామ పంచాయతీ భవనానికి 20లక్షలు, రంగరాయగూడెం నుండి కాషాగూడెం వరకు రోడ్డు నిర్మాణానికి అతి త్వరలోనే మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. ఇప్పగూడెం గ్రామం రాజకీయ చైతన్యం కలిగిన గ్రామమని అన్నారు. ఇప్పగూడెం గ్రామానికి మొదటి విడతలో 54ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేశామని, ఇప్పుడు మళ్ళీ 49మందికి మంజూరు పత్రాలను పంపిణి చేస్తున్నట్లు తెలిపారు. ఈ రెండున్నర ఏళ్ల కాలంలో 4కోట్ల 70లక్షలతో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం, కోటి 10లక్షలతో సిసి రోడ్లు, కోటి 23లక్షల కూడా నిధులతో మరో సిసి రోడ్డు నిర్మాణం మొత్తం దాదాపు 7కోట్ల అభివృద్ధి పనులను చేపట్టామని అన్నారు. రానున్న రెండేళ్లలో మరో 5కోట్ల నిధులు ఇప్పగూడెం గ్రామ అభివృద్ధికి కేటాయిస్తానని హామీ ఇచ్చారు. నెల రోజుల్లో ముదిరాజ్, ఎస్సి కమ్యూనిటీ హాళ్లకు మంజూరు చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ లు పంచాయతీ రాజ్, హౌసింగ్ శాఖ అధికారులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# మిన్‌పూర్ తాండా పాఠశాల విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ



చౌటకూర్, జూన్ 17 (విజన్ ఆంధ్ర ):– మండల పరిధిలోని ఎంపీపీఎస్ మిన్‌పూర్ తాండా పాఠశాల విద్యార్థులకు బొమ్మారెడ్డిగూడెం గ్రామానికి చెందిన పదవీ విరమణ పొందిన ఎంపీడీఓ గోపాల్ దంపతులు తమ సహాయ సహకారాలతో బ్యాగులు, పెన్నులు, పెన్సిళ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పుల్కల్ మండల విద్యాశాఖ అధికారి (ఎంఈఓ) శంకర్ మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు విద్యా దానం చేయడం గొప్ప సేవ అని, ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించే వారికి సుఖసంతోషాలు కలుగుతాయని అన్నారు. ఈ సందర్భంగా పదవీ విరమణ పొందిన ఎంపీడీఓ గోపాల్ మాట్లాడుతూ, పరిసర ప్రాంతాల్లోని తండాలతో పోలిస్తే మిన్‌పూర్ తాండా విద్యార్థులు ప్రాథమిక స్థాయి నుంచే చక్కగా చదువుకుని దేశస్థాయిలో ఐఐటీ వంటి ప్రతిష్ఠాత్మక పరీక్షల్లో ర్యాంకులు సాధిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారని పేర్కొన్నారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని మరింత కృషి చేయాలని సూచించారు.

కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అమూనా శంకర్, గోపాల్ దంపతులు, పంచాయతీ కార్యదర్శి, ఉపాధ్యాయులు విష్ణువర్ధన్ రెడ్డి, ఉమాదేవి, ఏఏపీ చైర్‌పర్సన్ మంజుల, మాజీ సర్పంచ్ సంగ్యా నాయక్, వార్డు సభ్యులు, అంగన్‌వాడీ టీచర్ సుగుణ బాయి, గ్రామ పెద్దలు రామావత్ శంకర్, గోరం శంకర్, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ముందుకు రావాలి



**ఎన్నికల హామీలను వెంటనే అమలు చేయాలని యూఎస్ఎఫ్ఐ డిమాండ్**

**చిన్న, మధ్య తరహా పత్రికలకు ప్రకటనలు, పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి**

**జర్నలిస్టులకు హెల్త్ కార్డులు, బీమా, ఇళ్ల స్థలాలు కల్పించాలి**

**కేబుల్, ఐపిటీవీ న్యూస్ ఛానళ్లకు అక్రెడిటేషన్ సదుపాయం విస్తరించాలి**

**సీనియర్ జర్నలిస్టులకు పెన్షన్, మహిళా జర్నలిస్టులకు ప్రత్యేక పథకాలు అమలు చేయాలి**

కుత్బుల్లాపూర్, జూన్ 17 (విజన్ ఆంధ్ర): రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం అత్యవసరంగా పరిష్కరించాలని యునైటెడ్ స్టేట్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (యూఎస్ఎఫ్ఐ) మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు ఎం. చంద్రకాంత్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా చంద్రకాంత్ మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత కూడా జర్నలిస్టుల పట్ల పాలకుల వివక్ష కొనసాగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా చిన్న, మధ్య తరహా పత్రికలు, పీరియాడికల్స్‌తో పాటు వాటిలో పనిచేస్తున్న జర్నలిస్టులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు గడుస్తున్నప్పటికీ ఎన్నికల సమయంలో జర్నలిస్టులకు ఇచ్చిన హామీల్లో ఒక్కటీ అమలు కాలేదని విమర్శించారు. గత ప్రభుత్వ హయాంలో నెలకొన్న సమస్యలే ఇప్పటికీ కొనసాగుతున్నాయని అన్నారు. చిన్న, మధ్య తరహా పత్రికలకు రెండేళు ్లగా ప్రకటనల బిల్లులు చెల్లించలేదని, ప్రభుత్వ ప్రకటనల కేటాయింపులోనూ తీవ్ర కోతలు విధించారని ఆరోపించారు. అన్ని మీడియా సంస్థలకు ప్రభుత్వం చెల్లించాల్సిన పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని, చిన్న, మధ్య తరహా పత్రికలు, పీరియాడికల్స్‌కు తగిన ప్రాధాన్యతనిస్తూ ప్రకటనలు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఎంపానెల్‌మెంట్‌తో సంబంధం లేకుండా ప్రతి పత్రికకు నెలకు కనీసం ఒక ప్రభుత్వ ప్రకటన ఇవ్వాలని కోరారు. జర్నలిస్టుల సంక్షేమం కోసం ప్రింటింగ్ ప్రెస్‌ల ఏర్పాటుకు అవసరమైన భూమి కేటాయించాలని, చిన్న, మధ్య తరహా పత్రికలకు ఎంపానెల్‌మెంట్ సదుపాయాన్ని కల్పించాలని సూచించారు. అక్రెడిటేషన్ కార్డులతో పాటు ప్రభుత్వ ఉద్యోగులకు ఉన్నట్లే హెల్త్ కార్డులు, బీమా సౌకర్యాలు జర్నలిస్టులకు అందించాలని కోరారు. కేబుల్ టీవీ న్యూస్ ఛానళ్లకు అక్రెడిటేషన్ కార్డుల సంఖ్యను పెంచాలని, ఇంటర్నెట్ ప్రోటోకాల్ టెలివిజన్ (ఐపిటీవీ) న్యూస్ ఛానళ్లకు కూడా అక్రెడిటేషన్ సదుపాయం కల్పించాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టుల ఇళ్ల స్థలాల కేటాయింపు విషయంలో ప్రభుత్వం స్పష్టమైన నిర్ణయం తీసుకోకుండా జాప్యం చేస్తోందని విమర్శిస్తూ, కొత్త విధానంతో అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని కోరారు. అదేవిధంగా సీనియర్ జర్నలిస్టులకు పెన్షన్ పథకం అమలు చేయాలని, మహిళా జర్నలిస్టుల కోసం ప్రత్యేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టాలని ఎం. చంద్రకాంత్ ప్రభుత్వాన్ని కోరారు.



## ఐఐటీలో మంచి ర్యాంకు సంపాదించడం అభినందనీయం

బైంసా :జూన్ 17:విజన్ ఆంధ్ర : బైంసా పట్టణంలోని జయశంకర్ కాలనీకి చెందిన కిష్టపురం సాయి ప్రణవ్ ఇటీవల వెలువడిన ఐఐటి పరీక్ష ఫలితాల్లో జాతీయస్థాయిలో 11569 ర్యాంకును సాధించిన సందర్భంగా ఆయనకు బుధవారం రోజు శ్రీ పోతులూరి వీర బ్రహ్మేంద్ర స్వామి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శాలువాతో ఘనంగా సన్మానించి మెమొంటోను అందజేశారు ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ విశ్వబ్రాహ్మణ కుటుంబం నుండి ఐఐటీలో మంచి ర్యాంకు సంపాదించడం ఎంతో అభినందనీయమని అన్నారు కష్టపడి చదివి మంచి ఉన్నత స్థాయికి ఎదిగి తల్లిదండ్రికి జాతికి గ్రామానికి పేరు ప్రతిష్టలు తేవాలని సూచించారు ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బెజ్జంకి రవీంద్ర చారి జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ అమ్ముల సాగర్ బైంసా పట్టణ కోశాధికారి చిలుముల అశోకవర్ధన చారి కార్యవర్గ సభ్యులు లక్ష్మీనారాయణ చారి కలికోట సాయినాథ్ ఎర్రోజు ఆనంద్ కట్ట లవన్ రంగు జయప్రకాష్ తదితరులు పాల్గొన్నారు

## "అమ్మ మాట అంగన్ వాడీ బాట" ను విజయవంతం చేయాలి



స్టేషన్ ఘన్‌పూర్, జూన్ 17, (విజన్ ఆంధ్ర): అమ్మ మాట అంగన్ వాడీ బాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మున్సిపల్ చైర్మన్ తాటికొండ వినయ్ కుమార్ పిలుపునిచ్చారు. బుదవారం మున్సిపాలిటీ కేంద్రంలోని అంగన్ వాడి 3వ సెంటర్ ను సందర్శించారు. పిల్లలకు అందించే పౌష్టికాహారం గురించి వారి తల్లిదండ్రులకు తెలియజేశారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి, రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే కడియం శ్రీహరి సారథ్యంలో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న అమ్మ మాట అంగన్ వాడీ బాట కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. అంగన్ వాడి కేంద్రాల్లోని పిల్లల శరీర ఎదుగుదలకు సరైన పౌష్టిక ఆహారం అందిస్తూ తనదైన శైలిలో విద్యాబోధన చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్ వాడి టీచర్ రడపాక మాధవి, ఇందిరమ్మ కమిటీ సభ్యులు తాటికొండ యాదగిరి, ఆశ కార్యకర్త తాటికొండ మేరీల, ఆయా మట్టెడ, ఎలేంద్ర, గాదె వినోద, చిన్నారులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ టౌన్ అధ్యక్షులు పెంటన్న యాదవ కు ఘన సన్మానం

కొత్తకోట జూన్ 17 (విజన్ ఆంధ్ర): కొత్తకోట: పట్టణ కాంగ్రెస్ పార్టీ టౌన్ అధ్యక్షులుగా దేసి పెంటన్న యాదవ్ నియమితులైన సందర్భంగా బుధవారం ఎమ్మెల్యే జి మధుసూదన్ రెడ్డిని మర్యాదపూర్వగా కలిశారు. అందుకుగాను ఎమ్మెల్యే జిఎంఆర్ పెంటన్న యాదవ్ ను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పెంటన్నయాదవ్ మాట్లాడుతూ కాంగ్రెస్ టౌన్ అధ్యక్షులుగా అకాశం కల్పించినందుకు గాను ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలియజేసి కాంగ్రెస్ పార్టీ బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. ఎమ్మెల్యే ని కలిసిన వారిలో నాయకులు జెసిబి రాములు, సుభాష్, సాయిరాం, తదితరులు ఉన్నారు.

# ప్రైవేటు పాఠశాలల ఫీజుల దోపిడీ అరికట్టాలి

### ఏఐఎస్ఎఫ్ జిల్లా ఇన్చార్జ్ రమేష్

వనపర్తి జూన్ 17 (విజన్ ఆంధ్ర బ్యూరో ) : జిల్లాలో ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు ఫీజులు, పాఠ్యపుస్తకాలు, యూనిఫారాల పేరుతో విద్యార్థులను దోచుకుంటున్నారని ఏఐఎస్ఎఫ్ జిల్లా ఇన్చార్జ్ రమేష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే తనిఖీలు చేసి పాఠశాలల దూపిడిని అరికట్టాలని డీఈఓ ఆఫీస్ సూపరిండెంట్ కు వినతిపత్రం సమర్పించారు. జిల్లాలో విచ్చలవిడిగా ప్రైవేటు పాఠశాలలు దోచుకుంటున్న అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు ప్రేక్షకపాత్ర వహిస్తున్నారని ఆరోపించారు. ఎల్కేజీ కి రూ. 20వేల నుంచి రూ. 40 వేలు, ఆరవ తరగతి నుంచి 10 వరకు రూ. 60 వేల నుంచి రూ. లక్ష వసూలు చేస్తున్నారన్నారు. వేర్వేరు కంపెనీల పేరు చెప్పి పాఠ్యపుస్తకాలను పాఠశాలల్లో అధిక ధరలకు విద్యార్థులకు అంటగడుతున్నారని, పాఠశాల యూనిఫారాల పేరుతో వేలాది రూపాయలు వసూలు చేస్తున్నారన్నారు. పలు పాఠశాలలకు అనుమతులు లేవని, ప్రభుత్వం నిర్దేశించిన సౌకర్యాలు క్రీడామైదానాలు గదులు లేకున్నా ఫీజులు మాత్రం తగ్గించటం లేదన్నారు. పాఠశాలలను



డీఈవో తనిఖీ చేసి దోపిడీ చేస్తున్న పాఠశాలలపై కేసులు పెట్టాలన్నారు. ఇష్టారాజ్యంగా ఫీజులను వసూలు చేయకుండా ఫీజులను నియంత్రించాలని డిమాండ్ చేశారు. పాఠశాలల్లో ఫీజుల పట్టికను పెట్టాలని జిల్లా కలెక్టర్ ఫీజులను నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. దోపిడీ ఇలాగే కొనసాగితే విద్యార్థులను సమీకరించి పాఠశాలల వద్ద ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఏఐఎస్ఎఫ్ డివిజన్ కార్యదర్శి వంశీ, ఉదయ్, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

# నాడు మాటిచ్చాడు - నేడు ఇల్లు ఇచ్చాడు

### - ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కు కృతజ్ఞతలు తెలిపిన నిరుపేద అక్కమోని లక్ష్మమ్మ

నందిగామ: జూన్ 17 (విజన్ ఆంధ్ర న్యూస్) : నిలువ నీడలేక గుడిసెలో తలదాచుకుంటున్న మండల కేంద్రమైన నందిగామ గ్రామంలోని రెండవ వార్డులోని నిరుపేద అభాగ్యురాలు అక్కమోని లక్ష్మమ్మ.రెండు నెలల క్రితం నందిగామ గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కు చేతులు జోడించి తనకు రేషన్ కార్డు, ఇల్లు ఇవ్వమని కన్నీరు కారుస్తూ మొరపెట్టుకుంది.రేషన్ కార్డు ఇస్తా - ఇల్లు ఇస్తానని భరోసా ఇచ్చి ఆమెకు మాటిచ్చాడు. ఇచ్చిన మాట ప్రకారం మూడు రోజుల్లోనే రేషన్ కార్డు ఇప్పించి ఎమ్మెల్యే చరిత్ర సృష్టించారు. ఇప్పుడు ఏకంగా ప్రభుత్వ పరంగా పంపిణీ చేస్తున్న డబుల్ బెడ్ రూమ్ ఇల్లు ఇచ్చి మాట తప్పని - మడమ తిప్పని మహా నేతగా నిలిచారు.బుధవారం నందిగామ మండల కేంద్రంలో ఉన్న డబుల్ బెడ్ రూముల్లో (104)వ నంబర్ గల డబుల్ బెడ్ రమ్ ఇంటిని నందిగామ సర్పంచ్ కొమ్ము కృష్ణ,ఉపసర్పంచ్ సారా వెంకటేష్ గౌడ్ లు కేటాయించారు.మాట



ప్రకారం తనకు రేషన్ కార్డు,ఇల్లు ఇచ్చిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కు నిరుపేద లక్ష్మమ్మ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో షాద్ నగర్ ఏఎంసీ డైరెక్టర్ చాకలి నర్సింలు,వార్డు సభ్యులు అగ్గిప్రసాద్,శివగల్ల సురేష్,పట్నం కృష్ణ యాదవ్,నాయకులు కేశమోని రామచంద్రి తదితరులు పాల్గొన్నారు.

## ఆల్ పార్టీ ప్రతినిధులతో ఆర్డీఓ సమావేశం...

బోధన్, జూన్17 (విజన్ ఆంధ్ర): బోధన్ ఆల్ పార్టీ ప్రతినిధులతో ఆర్డీఓ విజయకుమారి సమావేశం నిర్వహించారు. బుధవారం పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో రాజకీయ పార్టీ ప్రతినిధులతో ఆర్డీఓ బిఎల్ఏ ల కార్యకలాపాలలో పాటించవలసిన నిబంధనలగురించి, ఎస్ఐఆర్ లోని పలు అంశాల గురించి చర్చించారు. బిఎల్ఏ లను పిఎస్ ల వారిగా నియమించే విషయంపై, ఎస్ఐఆర్ 2026షెడ్యూల్ గురించి, ఎన్యూమరేషన్ ఫార్మ్ నింపే విధానం గురించి వివరించారు.



## విద్యార్థులకు పాఠ్య పుస్తకాల పంపిణీ

కుల్కచర్ల, జూన్, 17 (విజన్ ఆంధ్ర) : ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పాఠ్య పుస్తకాలను పంపిణీ చేసినట్లు ముజాహిద్ పూర్ సర్పంచి చంద్రభూపాల్ రావు, ఉప సర్పంచి అరుణ తెలిపారు. కుల్కచర్ల మండల పరిధిలోని ముజాహిద్ పూర్ గ్రామంలోని ఉన్నత పాఠశాల విద్యార్థులకు పాఠ్య పుస్తకాలను పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ... ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడానికి అందరూ కృషి చేయాల్సి ఉందన్నారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అల్పాహారం, మధ్యాహ్న భోజన సౌకర్యం, ఏకరూప దుస్తులు, పాఠ్య పుస్తకాలను ప్రభుత్వం ఉచితంగా అందించడం జరుగుతుందన్నారు. అంతేకాకుండా ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ చూపిస్తూ ఏఐ ఆధారిత బోధన చేయడం జరుగుతుందన్నారు. అందుకే తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని తెలియజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు భాస్కర్ , భీమయ్య , కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు షర్పోద్దీన్, పాఠశాల ఉపాధ్యాయ బృందం, తదితరులు పాల్గొన్నారు.



# ఇందిరమ్మ ఇంట్లో వెలిగిన ఆనంద దీపం

## పేదల సొంతింటి కలను నిజం చేస్తున్న ప్రజా ప్రభుత్వం

షాద్ నగర్, విజన్ ఆంధ్రా జూన్ 17: సొంత ఇంటి కల ప్రతి కుటుంబానికి ఒక జీవిత లక్ష్యం.ఆ కలను సాకారం చేస్తూ ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ గృహ పథకం పేద కుటుంబాల్లో కొత్త ఆశలు నింపుతోంది. ఫరూక్‌నగర్ మండలం కంసాన్‌పల్లి గ్రామానికి చెందిన మాల సాయిలు దంపతులు నూతనంగా నిర్మించుకున్న ఇందిరమ్మ గృహంలో బుధవారం గృహప్రవేశ వేడుకను ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ఫరూక్‌నగర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాయికల్ శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై గృహ యజమానులను అభినందించారు. నూతన గృహంలో అడుగుపెట్టిన కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ...వారి ఆనందంలో భాగస్వామ్యమయ్యారు.

ఈ సందర్భంగా రాయికల్ శ్రీనివాస్ మాట్లాడుతూ... పేద ప్రజల సొంతింటి కలను నిజం చేసే గొప్ప సంక్షేమ కార్యక్రమం ఇందిరమ్మ గృహ పథకమని అన్నారు. ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలు గౌరవప్రదమైన జీవనం గడపడానికి ఈ పథకం ఎంతో దోహదపడుతోందన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందేలా కృషి కొనసాగుతోందని పేర్కొన్నారు.సొంతిల్లు కేవలం నాలుగు గోడలు కాదు.అది ఒక కుటుంబానికి భద్రత, గౌరవం, భవిష్యత్తుపై నమ్మకం, ప్రజా ప్రభుత్వం పాలనతో సబండవర్గాలు సంతోషంగా ఉన్నాయని ఈ సందర్భంగా పేర్కొన్నారు .ఇందిరమ్మ గృహాలు అలాంటి వేలాది కుటుంబాల జీవితాల్లో వెలుగులు నింపుతున్నాయని గ్రామస్తులు అభిప్రాయపడ్డారు. గృహ యజమాని మాల సాయిలు మాట్లాడుతూ.. తమకు ఇందిరమ్మ గృహం మంజూరు చేసిన రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చొరవతో తమ సొంత ఇంటి కల నెరవేరిందని, ఇందుకు ఆయనకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఎన్నో ఏళ్లుగా ఎదురుచూసిన తమ కుటుంబ స్వప్నం నేడు సాకారమైందని ఆనందం వ్యక్తం చేశారు.

ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ నరేందర్ రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు మును, గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లేష్ కురుమ, ఎడ్ల మహేందర్, తుపాకుల శేఖర్ ముదిరాజ్, నర్సింలు గౌడ్, వార్డు సభ్యుడు చెన్నయ్య, చింతకింది సత్యనారాయణతో పాటు గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# రేవల్లి మండలం కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల సమావేశం

రేవల్లి జూన్ 17 (విజన్ ఆంధ్ర ):రేవల్లి మండల కమిటీ ఏర్పాటు ముఖ్య కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో నిర్వహించారు.రేవల్లి మండల కేంద్రంలో ఈరోజు రేవల్లి మండల ఎగ్జిక్యూటివ్ మీటింగ్ ఇన్చార్జి గురించి రేవల్లి మండలం ఇంచార్జ్ ఐ.సత్యా రెడ్డి గారు ఉమ్మడి గోపాల్ పేట మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ ఎం. సత్యశిల రెడ్డి రేవల్లి మండల అధ్యక్షులు వీణ సుల్తాన్ ఆలీ గారి ఆధ్వర్యంలో నిర్వహించారు.

భుత్ లేవల్ ఏజెంట్ల ఇంచార్జలు వారు క్షేత్రస్థాయిలో చేయు పనుల గూర్చి విధి విధానాల ఓట్ల సమికరణ గురించి తెలియజేయడం వివరించారు. కార్యక్రమంలొ మండలం మెయిన్ కమిటీ సభ్యులు అందరూ కలిసి బూత్ లెవెల్ ఏజెంట్ల ఇన్చార్జ్ ను ఎన్నుకోవడం జరిగింది (రేవల్లి మరియు కొంకలపల్లి మరియు శానయిపల్లి) దీూూ ఇంచార్జ్ కూర చందు మరియు (గచి?రీదేవిపల్లి రావిపాకుల నాగపూర్) దీూూ ఇంచార్జ్ మిద్దె స్వామి మరియు (తలుపునుర్ మరియు పాత తండా మరియు కేశంపేట)దీూూ ఇంచార్జ్ కాట్రవత్ శంకర్ గారిని ఎన్నుకోవడం జరిగింది ఈ కార్యక్రమానికి రేవల్లి సర్పంచ్ టప్ప రాజయ్య మరియు ఉప అధ్యక్షులు ూ.నాగ శేషయ్య కేశంపేట ప్రధాన కార్యదర్శిలు 1.ఉమానామోని కృష్ణ తల్పునూర్ 2ూ. వెంకటయ్య గౌడ్ కేశంపేట 3. నక్క భాస్కర్ రెడ్డి గౌరీదేవిపల్లి 4. సభావాత్ రమేష్ కొత్త తండా 5. టి బాల్ రెడ్డి రేవల్లి 6. సుకుమార్ రెడ్డి బండరాయి పాకుల. కార్యదర్శులు:- 1. మిద్దె వీరస్వామి బండరాయిపాకుల 2. నడిమింటి చెన్నయ్య నాగపూర్. 3.ఆంగోతు శంకర్ పాత తాండ 4. కట్రవత్ శంకర్ తలుపునూరు తండా 5. సుబ్బారెడ్డి రాయిపాకుల 6. గోవర్ధన్ రెడ్డి నాగపూర్ 7. మీ సుబ్బయ్య రేవల్లి. 8. ఎన్ కురుమూర్తి తలుపునూర్ 9. మల్ల కురుమయ్య కొంకలపల్లి. 10. పి రవీందర్ రెడ్డి శానాయిపల్లి

11. కురుమూర్తి తలుపునూర్

రేవల్లి మండల ూజజ.కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కో ఆర్డినేటర్ 1.కూర చందు 2. రేవల్లి మండలం కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా వీ. అశోక్ ఇంచార్జ్ మిద్దె రాములు. 3. రేవల్లి మండలం సోషల్ మీడియా ఇంచార్జ్ .మిద్దె రాములు. ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ :-1.రాజా వర్ధన్ రెడ్డి రాయిపాకుల 2. కేతపల్లి తిరుపతయ్య తలుపునూర్ 3. జింకల శ్రీను రేవల్లి. 4. రాజశేఖర్ రెడ్డి శానాయిపల్లి ప్రదీప్ రేవల్లి పాల్గొన్నారు

రేవల్లి కాంగ్రెస్ పార్టీ మండలం అధ్యక్షులు

వీణ సుల్తాన్ ఆలీ, కూర చందు రేవల్లి మండలశీ టిపిసిసి సోషల్ మీడియా కో ఆర్డినేటర్ తదితరులు పాల్గొన్నారు.

# రైతుల కోసం యూరియా యాప్ . సాయి దిశిత్



మధిర, జూన్ 17(విజన్ ఆంధ్ర) : మధిర మండలంలోని రైతులందరికీ బుధవారం నుంచి మధిర మండలంలో యూరియా యాప్ తీసుకుని రావడం జరిగింది..కావాల్సిన రైతులు తమ ఫోన్ లో ఇంట్లో కూర్చొని యూరియా బుక్ చేసుకోవచ్చు అంతకు ముందులాగా గంటల తరబడి లైన్లో నిల్చవలసిన అవసరం లేదు కాబట్టి రైతులందరూ ఈ యాప్ ని సద్వినియోగం చేసుకొని యూరియాని బుక్ చేసుకోగలరు ప్రస్తుతం ఒక ఎకరాకు రెండు బస్తాల యూరియా అందుబాటులోకి తీసుకురావడం జరిగింది మధిర మండలంలో ప్రస్తుతం 260 టన్నుల యూరియా అందుబాటులో ఉంది. ఒకవేళ యూరియా యాప్ లో బుక్ చేసుకోవడం రాని వాళ్ళు మీ దగ్గరలో ఉన్న వ్యవసాయ విస్తరణ అధికారిని సంప్రదించగలరు.అని మధిర వ్యవసాయ అధికారి సాయి దిశిత్ తెలిపారు

### పేదల సొంతయింటి కళ నెరవేరస్తున్న - కాంగ్రెస్ సర్కార్

పెబ్బేరు జూన్ 17 ( విజన్ ఆంధ్ర ): పెబ్బేరు మండల పరిధిలోని రాంపురం గ్రామంలో నేడు నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశ కార్యక్రమం లో పాల్గొని ఇంటి లబ్ధిదారుడు శేఖర్ ని మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు శాలువాతో సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా లబ్ధిదారుడు మాట్లాడుతూ ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసిన కాంగ్రెస్ ప్రభుత్వనికి, ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ గృహప్రవేశ కార్యక్రమం లో మార్కెట్ వైస్ చైర్మన్ విజయ్ వర్ధన్ రెడ్డి,జిల్లా యువజన నాయకులు రంజిత్ కుమార్,పెబ్బేరు టౌన్ అధ్యక్షులు దయాకర్ రెడ్డి,మండల సీనియర్ నాయకులు సత్యాన్నారాయణ రెడ్డి, ఆశన్న నాయుడు ,రామ్మోహన్ రెడ్డి, బాలరాజు యాదవ్, మురళీధర్ రెడ్డి, ఆంజనేయులు, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.వనపర్తి ఎమ్మెల్యే కు ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ గృహప్రవేశ కార్యక్రమం లో మార్కెట్ వైస్ చైర్మన్ విజయ్ వర్ధన్ రెడ్డి,జిల్లా యువజన నాయకులు రంజిత్ కుమార్,పెబ్బేరు టౌన్ అధ్యక్షులు దయాకర్ రెడ్డి,మండల సీనియర్ నాయకులు సత్యాన్నారాయణ రెడ్డి, ఆశన్న నాయుడు ,రామ్మోహన్ రెడ్డి, బాలరాజు యాదవ్, మురళీధర్ రెడ్డి, ఆంజనేయులు, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

# అమ్మాపూర్ ప్రభుత్వ పాఠశాలలో సామూహిక అక్షరాభ్యాసం

- నవాబుపేట మండలం అమ్మాపూర్ మండల పరిషత్ ఉన్నత పాఠశాలలో ఘనంగా కార్యక్రమం
- ముఖ్య అతిథిగా లింగంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల జిహెచ్ఎం చిన్న కిష్టయ్య పాల్గొన్నారు
- దీప ప్రజ్వలన, ఓం నమః శివాయతో అక్షరం నేర్పిన ఉపాధ్యాయులు
- తల్లిదండ్రులు, గ్రామస్తులు, అంగన్వాడీ ఉపాధ్యాయులు హాజరు
- పాఠశాల అభివృద్ధికి ఒక ఉపాధ్యాయుడిని కేటాయిస్తామని హామీ




జడ్చర్ల / నవాబుపేట / జూన్ 17 (విజన్ ఆంధ్ర) : నవాబుపేట మండలం అమ్మాపూర్ గ్రామంలోని మండల పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం 2026-27 విద్యా సంవత్సరం 'బడిబాట' కార్యక్రమంలో భాగంగా నూతనంగా చేరిన మొదటి తరగతి విద్యార్థులకు సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. దీప ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించి, ఉపాధ్యాయులు బోర్డు పైన ఓం నమః శివాయ సిద్ధం నమః రాయించి చిన్నారుల చేత పలకలపై అక్షరం దిద్దించారు. తొలి అక్షరం నేర్చుకున్న చిన్నారులు పలకలతో ఫోటోలకు ఆనందంగా పోజులిచ్చారు. ఈ కార్యక్రమానికి లింగంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల జిహెచ్ఎం చిన్న కిష్టయ్య ముఖ్య అతిథిగా హాజరై చిన్నారులను అక్షరోద్యుక్తులను చేశారు. జిహెచ్ఎం.చిన్న కిష్టయ్య మాట్లాడుతూ... విద్యార్థులకు చదువుతో పాటు క్రమశిక్షణ, నైతిక విలువలు నేర్పించాలి. ఉపాధ్యాయులు ప్రతి బిడ్డపై ప్రత్యేక శ్రద్ధ చూపి వారిని ఉన్నత శిఖరాలకు తీసుకెళ్లాలి. పాఠశాల అభివృద్ధి అనేది ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, గ్రామస్తులందరి బాధ్యత. ఈ జూన్ నెలలో జరిగే పని సర్దుబాటులో భాగంగా అమ్మాపూర్ మండల పరిషత్ ఉన్నత పాఠశాలకు ఒక ఉపాధ్యాయుడిని తప్పకుండా కేటాయిస్తామని హామీ ఇస్తున్నాను. పాఠశాలకు కావాల్సిన సౌకర్యాల కోసం పై అధికారుల దృష్టికి తీసుకెళతాను. కార్యక్రమంలో పాఠశాల అభివృద్ధి కమిటీ అధ్యక్షురాలు మంజుల రఘు, అంబేద్కర్ యువజన సంఘం సభ్యులు యాదయ్య, శ్యామ్, మల్కయ్య, అంజనేయులు, స్వామి,పవన్ కుమార్, అంగన్వాడీ ఉపాధ్యాయురాలు సునీత, విద్యార్థుల తల్లిదండ్రులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు. శేఖర్, ఉపాధ్యాయులు. కృష్ణయ్య, శ్రీ విద్య, మాధవి తదితరులు పాల్గొన్నారు.

# కేజీబీవీ సీట్లలో మొదటి ప్రాధాన్యత బడి బయటి పిల్లలకు కల్పించాలి




## - మండల ఎంఈఓకు పిడీఎస్యు వినతిపత్రం

అయిజ జూన్ 17 (విజన్ ఆంధ్ర) : కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాలలో ప్రవేశాల సందర్భంగా మార్కుల ఆధారంగా కాకుండా గ్రామీణ పేద, అనాధ, బడి బయట ఉన్న పిల్లలకు మొదటి ప్రాధాన్యత కల్పించాలని పి డి ఎస్యు జిల్లా అధ్యక్షులు హాలింపాష డిమాండ్ చేశారు.

బుధవారం ఐజ మండల విద్యాధికారికి పిడిఎస్యు ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేజీబీవీలు ప్రధానంగా పేద, అనాధ, వెనుకబడిన, విద్యకు దూరమైన బాలికలకు నాణ్యమైన విద్యను అందించాలనే లక్ష్యంతో ఏర్పాటు చేయబడ్డాయని తెలిపారు. అయితే ప్రస్తుతం ప్రవేశాల ప్రక్రియలో మార్కులకు అధిక ప్రాధాన్యత ఇవ్వడం వల్ల నిజంగా విద్య అవసరమైన పేద కుటుంబాల పిల్లలు, అనాధలు, బడి బయట ఉన్న పిల్లలు ప్రవేశ అవకాశాలు కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యకు దూరంగా ఉన్న పిల్లలను తిరిగి విద్యావ్యవస్థలోకి తీసుకురావాలంటే వారికి కేజీబీవీ ప్రవేశాల్లో ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉ ందన్నారు. కాబట్టి కేజీబీవీ సీట్ల భర్తీలో గ్రామీణ పేద, అనాధ, బడి బయట ఉన్న పిల్లలకు మొదటి ప్రాధాన్యత కల్పించి వారికి విద్యా హక్కు అందేలా ప్రభుత్వం, విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పి డి ఎస్ యు జిల్లా అధ్యక్షులు హాలింపాష, మునిస్వామి, జిలాని విద్యార్థులు పాల్గొన్నారు.

# రికార్డుల లో తీర్మానం ఫోర్జరీ ఆరోపణలపై విచారణ - ఏపిఎం పిడమర్తి

కారేపల్లి,జూన్ 17(విజన్ ఆంధ్ర) : సింగరేణి మండలం గంగారంతండా గ్రామంలో డ్వాక్రా గ్రూప్ సంఘ సభ్యుల అనుమతి లేకుండా రికార్డుల్లో తీర్మానంలో సంతకాల ఫోర్జరీకి పాల్పడ్డారని అభియోగంపై సంబంధిత వ్యక్తులపై విచారణ చేపట్టామని ఏపీఎం పిడమర్తి వెంకటేశ్వర్లు తెలిపారు. మండల కేంద్రమైన కారేపల్లి ఐకెపి కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల గంగారంతండాకు చెందిన ఒక గ్రూప్ కు సంబంధించి రెండు లక్షల రూపాయల రుణం మంజూరిపై ఇటీవల పత్రికల్లో వచ్చిన ఆరోపణలపై విచారణ చేపట్టామన్నారు. దీనికి సంబంధించి సిసి పద్మ నిర్వహించిన ప్రాథమిక విచారణలో ఫోర్జరీ జరిగినట్లుగా నిర్ధారణ అయింది అన్నారు.గ్రూప్ కు సంబంధించి మహిళా సంఘ సభ్యులకు ఫిర్యాదులను పరిగణలోకి తీసుకొని పూర్తిస్థాయి విచారణ నిర్వహిస్తామన్నారు.దీనికి బాధ్యులైన వ్యక్తులపై శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.సీసీ నివేదికే కాకుండా క్షేత్రస్థాయిలో పరిశీలన నిర్వహించి పూర్తిస్థాయి నివేదికను అధికారులకు అందజేస్తామన్నారు




# రాష్ట్ర మహాసభ ల వాల్ పోస్టర్ విడుదల



పెబ్బేరు. జూన్ 17( విజన్ ఆంధ్ర ) తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం తెలంగాణ రాష్ట్ర 4వ మహాసభల వాల్ పోస్టర్స్ ను పెబ్బేరు హామాలి సంఘం భవనంలో బుధవారం విడుదల చేయడం జరిగింది. ఈ సందర్బంగా సిఐటియు వనపర్తి జిల్లా కార్యదర్శి మండ్ల రాజు తెలంగాణ వ్యవసాయకార్మిక సంఘశీ. జిల్లా ఉపాధ్యక్షులు దేవన్న మాట్లాడుతూ . సంఘశీ రాష్ట్ర 4వ మహాసభ లు ఈ నెల 20.21.22.తేదీలలో మహబూబ్ నగర్ పట్టణశీ జరుగుతాయని. 20న జరిగే బహిరంగ సభ కు ముఖ్య అతితి గా త్రిపుర మాజీ ముఖ్య మంత్రి మాణిక్ సర్కార్. కేంద్రకమిటీ సభ్యులు తమ్మినేని విరభద్రం.. కెవి పిఎస్ రాష్ట్రఅధ్యక్షులు.జాన్ వెస్లీ. అఖిల భారత వ్యవసాయకార్మిక సంఘశీ. ప్రధాన కార్యదర్శి బి. వెంకట్.శివ దాసన్. ఎంపీ.లు హాజరు అవుతున్నారని తెలిపారు.. మొదటి రోజు 20న మహబూబ్ నగర్ టౌన్ హాల్ నుంచి భారీ ప్రదర్శన. జూనియర్ కాలేజీ గ్రౌండ్ లొ బహిరంగ సభఉంటుందని తెలిపారు 21.22.తేదీలలో 33జిల్లాల నుంచి 1000 మంది ప్రతినిధులు హాజరు అవుతు న్నారు.దేశం లొ బిజెపి ఉపాధిని ఎత్తేశే క్రమంలో. కొత్తగా నరేగా చట్టం తెచ్చి కేంద్రం యిచ్చే 90%నిధులను 60%కి తగ్గించారని దింతో రాష్ట్ర ప్రభుత్వాలు 40%భరించలనే కోర్రి పెట్టటడం తో రానున్న రోజుల్లో ఉపాధి హామీ చట్టం లొ కూలీలకు పనిదినాలు కల్పించడం లొ కేంద్రం విఫలం అవుతుందని విమర్శించారు. కనీసవేతనాలు అమలు చేయాలనీ. రేషన్ షాప్ ల ద్వారా 14రకాల నిత్యవసర సరుకులు ఇవ్వాలని డీమాండ్ చేశారు. ఈ ఈ కార్యక్రమంలో హమారీ సాంగ్ అమాలి సంఘం నాయకులు బిసన్న బజారు బాలు కురుమూర్తి శివయ్య వెంకట రాములు వెంకటేష్ సత్తి తిరుపతి దేవి తదితరులు పాల్గొన్నారు.

# చేతిలో డబ్బు లేదు.. కాలేజీలో సీటు లేదు!"

## - ఫీజు రీయింబర్స్మెంట్ కొత్త విధానంతో పేద విద్యార్థులకు సీట్ల సంక్షోభం

## - అడ్వాన్స్ ఫీజు కడితేనే అడ్మిషన్ అంటున్న కళాశాలలు.. వేలాది కుటుంబాల్లో ఆందోళన

గద్వాల జూన్ 17 (విజన్ ఆంధ్ర) జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని

ప్రగతిశీల యువజన సంఘం పివైఎల్ జిల్లా కమిటీ అధ్యక్షుడు బీరెల్లి దానయ్య వుదయం తెలుగు డైలీ దినపత్రిక ప్రతినిధితో మాట్లాడుతూ రాష్ట్రంలో ఫీజు రీయింబర్స్మెంట్ అమలుకు ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త విధానం పేద విద్యార్థుల ఉన్నత విద్యపై తీవ్ర ప్రభావం చూపుతు న్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఫీజు రీయింబర్స్మెంట్ మొత్తాన్ని నేరుగా విద్యార్థుల ఖాతాల్లో జమ చేసేలా అమలు చేస్తున్న జీవో 8, జీవో 9ల నేపథ్యంలో అడ్మిషన్ల ప్రక్రియలో అనిశ్చితి నెలకొంది. ఇప్పటికే గత విద్యా సంవత్స రాలకు సంబంధించిన వేల కోట్ల రూపాయల ఫీజు బకాయిలు పెండింగ్‌లో ఉండటంతో ప్రైవేట్ కళాశాలలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. దీంతో కొత్తగా అడ్మిషన్లు కోరుతున్న విద్యార్థులు ముందుగా ఫీజు చెల్లిస్తేనే సీట్లు కేటాయిస్తామని అనేక విద్యాసంస్థలు స్పష్టం చేస్తున్నట్లు తెలుస్తోంది.

దీంతో పేద, మధ్యతరగతి కుటుంబాల విద్యార్థులు తీవ్ర ఆందోళనకు గురవుతు న్నారు. ప్రభుత్వం నుంచి రీయింబర్స్మెంట్ ఎప్పుడు వస్తుందో తెలియని పరిస్థితి ఒకవైపు, కళాశాలలు మాత్రం నగదు చెల్లింపులకే పట్టుబడటం మరోవైపు విద్యార్థులను ఇరకాటంలోకి నెట్టింది. ఇంజినీరింగ్, డిగ్రీ, ఫార్మసీ, బీఈడీ తదితర కోర్సుల్లో సీట్లు సాధించిన వేలాది మంది విద్యార్థులు ఫీజులు చెల్లించే స్థోమత లేక అడ్మిషన్లకు దూరమయ్యే ప్రమాదం నెలకొంది. విద్యార్థుల భవిష్యత్తు, తల్లిదం డ్రుల ఆశలు, విద్యాసంస్థల ఆర్థిక వ్యవస్థ మూడు కూడా సంక్షోభంలో చిక్కుకున్నా యనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఫీజు కట్టలేక సీటు పోతుంది... రీయింబ ర్స్మెంట్ కోసం ఎదురుచూస్తే చదువు దూరమవుతోంది" పేద విద్యార్థుల నుంచి వినిపిస్తున్న ఈ వేదన ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా చర్చ నీయాంశంగా మారింది. పెండింగ్ బకాయిలు వెంటనే విడుదల చేసి, అడ్మిషన్ల ప్రక్రియకు స్పష్టమైన మార్గద ర్శకాలు జారీ చేయాలని విద్యార్థి సంఘాలు, తల్లిదండ్రులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

# ప్రభుత్వ కళాశాలలో ఉచిత పాఠ్య పుస్తకాల పంపిణీ




## ప్రిన్సిపల్ ఆర్ మాన్య నాయక్

అయిజ జూన్ 17 (విజన్ ఆంధ్ర) స్థానిక ఐజ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం రోజు విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాల పంపిణీ కార్యక్రమం ప్రిన్సిపల్ మాన్య నాయక్ అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ అయిజ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నాణ్యమైన విద్య అభ్యసించడానికి విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలను ఇవ్వడం జరిగిందని తెలుపుతూ అదేవిధంగా అనుభవజ్ఞులైన అధ్యాపకుల ద్వారా విద్యార్థులకు బోధన నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని రకాల సౌకర్యాలు ముఖ్యంగా విశాలమైన, ఆహ్లాదకరమైన వాతావరణంతో కూడిన తరగతి గదులు, బోధనలో నైపుణ్యతను పెంచడం కోసం, విద్యార్థులకు ఆసక్తి పెంచడం కోసం గ్రీన్ బోర్డులు, డిజిటల్ టీవీలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విద్యార్థులు ఆరోగ్యవంతంగా ఉండడం కోసం శుభ్రమైన త్రాగునీటి సౌకర్యంతో పాటు శుభ్రమైన టాయిలెట్లు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. విద్యార్థుల మానసిక నైపుణ్యాన్ని శారీరక నైపుణ్యాన్ని పెంచడం కోసం ప్రతి రోజు యోగ, క్రీడా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కావున ప్రస్తుతం చదువుతున్న విద్యార్థులు క్రమం తప్పకుండా కళాశాలకు వచ్చి మంచి ఫలితాలు పొందాలన్నారు. అదేవిధంగా మండలంలోని పదవ తరగతి పాసైన విద్యార్థులు వెంటనే అయిజ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అడ్మిషన్లు పొంది పై సౌకర్యాలను వినియోగించుకోవాలన్నారు. అదేవిధంగా మండలంలోని ప్రజా ప్రతినిధులు, విధ్యార్థి నాయకులు, విద్యావంతులు, మీడియా మిత్రులు కళాశాల అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు పి శశిధర్ రెడ్డి, జి రాజేందర్, ఎం చలపతి రెడ్డి , ఎం కృష్ణ వర్ధన్, కే శ్రీరాములు, ఎం గాయత్రి, బాలస్వామి, నరేష్ కుమార్, ఎండి జహంగీర్ అలీ, ఎండి రహమత్, ఇస్మాయిల్, శ్యాం ప్రసాద్, లైబ్రేరియన్ ఎం రంగన్న, అధ్యాపకేతర సిబ్బంది సీనియర్ అసిస్టెంట్ వెంకట రాములు, జూనియర్ అసిస్టెంట్ మధు, అటెండర్ దొడ్డన్న, గోవిందు, విద్యార్థులు పాల్గొన్నారు.

## మార్కెటింగ్ శాఖ జాయింట్ డైరెక్టర్ రామాంజనేయులు మర్యాదపూర్వకంగా కలిసిన బద్వేల్ ఏఎంసి చైర్‌పర్సన్ నారిశెట్టి సుప్రజ

బద్వేలు,జూన్ 17(విజన్ ఆంధ్ర) బద్వేలు నియోజకవర్గంలోని పోరుమామిళ్ల లో రైతులకు మెరుగైన మార్కెట్ సదుపాయాలు కల్పించే దిశగా ఒక కీలక అడుగు పడింది. బద్వేలు వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసి) చైర్‌పర్సన్ నారిశెట్టి సుప్రజ, నాగేంద్రలు మార్కెటింగ్ శాఖ జాయింట్ డైరెక్టర్ రామాంజనేయులు ను బుధవారం ఉదయం మర్యాదపూర్వకంగా కలిసి, ప్రాంతీయ మార్కెట్ యార్డుల అభివృద్ధిపై చర్చించారు.

?ప్రస్తుతం నిర్మాణ దశలో ఉన్న పోరుమామిళ్ల ఉప మార్కెట్ యార్డ్ పనులను వీలైనంత త్వరగా పూర్తి చేసి, స్థానిక రైతులకు అందుబాటులోకి తీసుకురావాలని జేడీని కోరారు. పోరుమామిళ్లలో కొత్తగా రైతు బజార్ ఏర్పాటు చేయడంతో పాటు, ప్రస్తుతం బద్వేల్ లో ఉన్న రైతు బజార్ నిర్వహణను మరింత సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్లేలా చర్యలు చేపట్టాలన్నారు. అదేవిధంగా బద్వేల్ మార్కెట్ యార్డ్‌లో నూతనంగా షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టడం ద్వారా మార్కెట్ యార్డ్ కమిటీ ఆదాయాన్ని పెంచవచ్చుని, వారన్నారు

## ఆదిలాబాద్ గొప్ప నగరంగా మారబోతుంది



**-ఎమ్మెల్యే పాయల్ శంకర్**

ఆదిలాబాద్, జూన్ 17 (విజన్ ఆంధ్ర): ఆదిలాబాద్ జిల్లా గొప్ప నగరంగా మారబోతుందని ఎమ్మెల్యే పాయల్ శంకర్ పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని పలు వార్డులో అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే పాయల్ శంకర్ స్థానిక నాయకులు, అధికారులతో కలిసి భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాంట్రాక్టర్లు నాణ్యత విషయంలో రాజీ పడకుండా పనులు పూర్తి చేయాలని సూచించారు. పట్టణంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించడంతోపాటు మౌలిక వసతుల కల్పనకు తనవంతుగా కృషి చేస్తానని అన్నారు. జిల్లాలో క్రీడారంగ అభివృద్ధికి చర్యలు తీసుకుంటానని తెలిపారు. రానున్న రోజుల్లో పారిశ్రామిక కారిడార్, ఎయిర్ పోర్ట్ ఏర్పాటుతో జిల్లా రూపురేఖలు మారుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా మున్సిపల్ చైర్మన్ బండారి అనూష, వార్డు కౌన్సిలర్లు, బీజేపీ నాయకులు, కాలనీవాసులు తదితరులున్నారు.



## కనక గణపతి ఆశయ సాధనకు ఉద్యమించాలి: మల్లేశ్

ఆదిలాబాద్, జూన్ 17 (విజన్ ఆంధ్ర): ఆదిలాబాద్ పట్టణంలోని సుందరయ్య భవనంలో సీపీఎం ఆధ్వర్యంలో బుధవారం కామ్రేడ్ కనక గణపతి 7వ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేశ్ మాట్లాడుతూ.. ఆదివాసీల హక్కుల కోసం అలుపెరగని పోరాటం చేసిన గణపతి సేవలు మరువలేనివన్నారు. ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు లంక రాఘవులు, బండి దత్తాత్రి, పూసం సచిన్, మంజుల, సురేందర్, స్వామి, అరిఫా, ఆశన్న, రామారావు తదితరులు పాల్గొన్నారు.

# అన్ని రంగాల్లో జిల్లాను అగ్రస్థానంలో నిలపాలి

**- జిల్లా ఇన్చార్జి మంత్రి డ రాష్ట్ర వెనుకబడిన తరగతులు, బలహీన వర్గాల సంక్షేమ శాఖ, చేనేత జౌళి శాఖా మంత్రి శ్రీమతి ఎస్.సవిత**

**- జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి ఆధ్వర్యంలో జరిగిన జిల్లా స్థాయి సమీక్షా కమిటీ సమావేశంలో పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు**

కడప,జూన్ 17( విజన్ ఆంధ్ర)రాష్ట్ర ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా అభివృద్ధి సాధనతో పాటు జిల్లాను అన్ని రంగాల్లో అగ్రస్థానంలో నిలిపేందుకు అధికారులు,ప్రజాప్రతినిధులు సమన్వయం తో, సమిష్టిగా పాటుపడాలని జిల్లా ఇన్చార్జి మంత్రి మరియు
రాష్ట్ర వెనుకబడిన తరగతులు,బలహీన వర్గాల సంక్షేమ శాఖ, చేనేత జౌళి శాఖామంత్రి,జిల్లా ఇన్చార్జి మంత్రి ఎస్.సవిత అన్నారు.

బుధవారం స్థానిక కలెక్టరేట్ లోని పిజిఆర్ఎస్ హాలులో జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి ఆధ్వర్యంలో రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ, చేనేత జౌళి శాఖామంత్రి, జిల్లా ఇన్చార్జి మంత్రి ఎస్.సవిత అధ్యక్షతన అన్ని శాఖల అధికారులతో జిల్లా స్థాయి సమీక్షా కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో జిల్లా ఇన్చార్జి మంత్రి సవిత మాట్లాడుతూ ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారసులుగా ఉన్న అధికారులు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న పథకాలు, కార్యక్రమాలను ప్రజల్లోకి పూర్తిస్థాయిలో అందేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రంలో అన్ని రంగాల్లో అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్న రాష్ట్రముఖ్యమంత్రి రాష్ట్రంలో పేదరికాన్ని సమూలంగా తుడిచి పెట్టే లక్ష్యంతో అనేక అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేయాలన్నారు. జిల్లా లో అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలుఅందాలన్నారు. అందుకు అనుగుణంగా అధికారులు క్షేత్రస్థాయిలోబాధ్యతాయుతంగా కృషి చేయాలన్నారు. పారదర్శకత, అవినీతి రహిత పాలనే లక్ష్యంగా నడుస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గత ప్రభుత్వంలో జరిగిన అక్రమాలపై ప్రక్షాళన చేస్తున్నారన్నారు. ప్రజలకు ఒక జవాబుదారీతనంతో సుపరిపాలన అందిస్తూ స్వర్ణాంధ్ర ప్రదేశ్ లక్ష్య సాధన కు కృషి చేస్తున్నారన్నారు. ప్రభుత్వ ఆశయ సాధనలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని కోరారు.

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఒకవైపు సంక్షేమ పథకాలను సంతృప్తి స్థాయిలో ప్రజలకు అందిస్తూనే రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించడం జరుగుతోందన్నారు. ప్రజాస్వామ్య బద్ధంగా ప్రజల కోసం ప్రభుత్వం పని చేస్తోందని. జిల్లా సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా ప్రజా ప్రతినిధులు,అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. రెండేళ్ల సుపరిపాలనలో. అభివృద్ధి,సంక్షేమం,ప్రజలకు పారదర్శక పాలన ను అందించడమే ప్రధాన లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు వెళుతోంది. భవిష్యత్తులో కూడా ముఖ్యమంత్రి ఆలోచనా విధానాన్ని అందుకుని స్వర్ణాంధ్ర 2047 విజన్ సాకారం దిశగా వైఎస్ఆర్ కడప జిల్లాను అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు అధికారులు,ప్రజాప్రతినిధులు సమన్వయంతో కృషి చేద్దామన్నారు. రాష్ట్రాభివృద్ధికి ముఖ్యమంత్రి ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న కార్యక్రమాలను జిల్లా స్థాయి లో సక్రమంగా,విజయవంతం గా అమలు చేయడం అధికారుల బాధ్యత అన్నారు. ప్రభుత్వంలో భాగస్వాములైన జిల్లా కలెక్టర్ నుంచి అధికారులు, ఎమ్మెల్సీలు,ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు అందరూ జిల్లా అభివృద్ధిలో భాగస్వాములై. అర్హులైన వారందరికీ సంక్షేమ ఫలాలు అందేలా కృషి చేయాలి. ప్రజా ప్రతినిధులు,అధికారులు ఇరువురూ సమన్వయంతో పనిచేసి పారదర్శకంగా సంక్షేమ కార్యక్రమాలు అందించాలన్నారు.

ప్రస్తుతం జరుగుతున్న ఎస్.ఐ.ఆర్. కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ బాధ్యతా యుతంగా స్వీకరించి వారి వివరాలను నమోదు చేయాలన్నారు. స్వర్ణాంధ్ర--2047 లక్ష్యాల సాధనలో భాగంగా జిల్లాలో అమలు చేస్తున్న 10 సూత్రాల పురోగతిని, వైఎస్సార్ కడప జిల్లాలో ప్రాధాన్యతా రంగాల వారీగా అమలవుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, సాధించిన పురోగతి, భవిష్యత్ లక్ష్యాలు, పెట్టుబడులు, ఉపాధి అవకాశాలపై జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా జిల్లా ఇన్‌చార్జి మంత్రి సవితకు క్షుణ్ణంగా వివరించారు. 2025-26 ప్రాథమిక అంచనాల ప్రకారం జిల్లా స్థూల జిల్లా ఉత్పత్తి విలువ (+ణఖూ) రూ. 79,627 కోట్లు కాగా, రాష్ట్రంలో 8వ స్థానంలో ఉందని కలెక్టర్ వివరించారు. జిల్లా స్థూల విలువ జోడింపు (+వాూ) రూ. 73,405 కోట్లు నమోదైందన్నారు. జిల్లాలో తలసరి ఆదాయం రూ. 2,83,734 ఉండగా, రాష్ట్రంలో 12వ స్థానంలో ఉన్నట్లు తెలిపారు. ఆర్థిక వ్యవస్థలో సేవారంగం అత్యధికంగా రూ. 28,212 కోట్లతో 38.43 శాతం, పరిశ్రమల రంగం రూ. 23,830 కోట్లతో 32.46 శాతం, వ్యవసాయ మరియు అనుబంధ రంగాలు రూ. 21,363 కోట్లతో 29 శాతం వాటా కలిగి ఉన్నాయని మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. జిల్లాలో పరిశ్రమలు, సేవారంగం, వ్యవసాయ రంగాలు సమతుల్యంగా అభివృద్ధి చెందుతున్నాయని పేర్కొన్నారు. స్వర్ణాంధ్ర--2047 విజన్ కింద జిల్లాను మరింత వేగంగా అభివృద్ధి చేసేందుకు ప్రణాళిక రూపొందించినట్లు కలెక్టర్ తెలిపారు. ప్రస్తుతం రూ. 79 వేల కోట్ల స్థాయిలో ఉన్న జిల్లా ఆర్థిక వ్యవస్థను 2047 నాటికి రూ. 13.26 లక్షల కోట్ల ఆర్థిక వ్యవస్థగా మార్చడమే లక్ష్యమన్నారు. అలాగే ప్రస్తుతం రూ. 2.83 లక్షలుగా ఉన్న తలసరి ఆదాయాన్ని వ్యవసాయం, పరిశ్రమలు, సేవారంగాల ద్వారా 15 శాతానికి పైగా వార్షిక వృద్ధితో రూ. 34 లక్షలకు పెంచే లక్ష్యంతో పని చేస్తున్నట్లు వివరించారు.

2026-27 సంవత్సరానికి జిల్లా మొత్తం +వాూ లక్ష్యం రూ. 84,482 కోట్లు, +ణఖూ లక్ష్యం రూ. 91,606 కోట్లుగా నిర్ణయించినట్లు తెలిపారు. ఇందులో వ్యవసాయ, అనుబంధ రంగాల ద్వారా రూ. 23,908 కోట్లు, పరిశ్రమల ద్వారా రూ. 27,821 కోట్లు, సేవారంగం ద్వారా రూ. 32,753 కోట్లు సాధించేందుకు కార్యాచరణ అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. మహిళా సాధికారత లో 29,224 స్వయం సహాయక సంఘాలు, 2.86 లక్షల మహిళా సభ్యులు, రూ. 2,355.90 కోట్ల జీవనోపాధి ప్రణాళిక, రూ. 1,323.29 కోట్ల రుణ ప్రణాళిక అమలవుతున్నట్లు తెలిపారు. మత్స్యరంగంలో రూ. 300.25 లక్షల సబ్సిడీ, 511 లైసెన్సులు, 538 పెన్షన్ లబ్ధిదారులు, పట్టణాభివృద్ధిలో రూ. 52.78 కోట్లతో 520 టన్నుల సామర్థ్య మౌలిక వసతుల నిర్మాణం కొనసాగుతున్నట్లు వివరించారు. జిల్లా ఆర్థిక వృద్ధి లో ప్రధానంగా ఉద్యానవనం, గనులు, తయారీ పరిశ్రమలు, నిర్మాణ రంగం, రవాణా, రియల్ ఎస్టేట్, సేవారంగం కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు.

జిల్లాను"ఇన్వెస్ట్మెంట్ డెస్టినేషన్ సెంటర్" గా మార్చేందుకు కృషి చేస్తున్నామన్నారు. అందులో భాగంగానే కడప కలెక్టరేట్లో "ఇన్వెస్ట్ కడప సెంటర్" ను ఏర్పాటు చేసి జిల్లాలో పెట్టుబడులకు ముందుకొచ్చే ఇన్వెస్టర్లకు ప్రత్యేకమైన సూచనలు, సలహాలు, మార్గదర్శకాలను అందిస్తూ. పెట్టుబడుల ప్రారంభం నుండి ఆదాయాన్ని పొందేవరకు కూడా. ఒక జిల్లా స్థాయి అధికారి పర్యవేక్షణలో ముందుకు సాగనుందన్నారు. జిల్లాలో 6,59,288 బీపీఎల్ రైస్ కార్డులు, అందులో 6,18,560 పీహెచ్‌హెచ్ కార్డులు, 40,728 అంత్యోదయ అన్న యోజన (ూూయ్) కార్డులు ఉన్నాయని తెలిపారు. అలాగే 14 ఎంఎల్ఎస్ పాయింట్లు, 59 గ్యాస్ ఏజెన్సీలు, 215 పెట్రోల్ బంకులు సేవలు అందిస్తున్నట్లు వివరించారు. గృహ నిర్మాణ శాఖకు సంబంధించి. గ్రామీణ ప్రాంతాల్లో మొత్తం 98,374 ఇళ్లకు అనుమతులు మంజూరు చేయగా, 50,352 ఇళ్లు పూర్తయ్యాయి. మరో 48,022 ఇళ్లు వివిధ దశల్లో నిర్మాణంలో ఉండగా, మొత్తం పురోగతి 49 శాతంగా నమోదైంది. ఇందుకోసం ఇప్పటివరకు రూ. 1,328.92 కోట్లు వ్యయం చేసినట్లు తెలిపారు. అలాగే పీఎంఏవై (అర్బన్) 2.0 కింద జిల్లాలోని పట్టణ ప్రాంతాల్లో 1,918 ఇళ్లకు అనుమతులు మంజూరు చేయగా, 1,784 ఇళ్లు గ్రౌండింగ్ దశకు చేరుకున్నాయి. వీటిలో 1,223 ఇళ్లు నిర్మాణ పనులు ప్రారంభమై 68.6 శాతం పురోగతి సాధించాయి. ఇప్పటివరకు రూ. 480.5 లక్షలు లబ్ధిదారులకు చెల్లించినట్లు కలెక్టర్ వివరించారు ఈ సమీక్షా సమావేశంలో ప్రభుత్వ విప్,జమ్మలమడుగు శాసన సభ్యులు ఆదినారాయణ రెడ్డి,జేసి డా. నిధి మీనా, ఎమ్మెల్సీ రామ్ గోపాల్ రెడ్డి, ప్రొద్దుటూరు, కమలాపురం, మైదుకూరు శాసనసభ్యులు నంద్యాల వరద రాజుల రెడ్డి, పుత్తా కృష్ణ చైతన్య రెడ్డి, పుట్టా సుధాకర్ యాదవ్, రాజంపేట సబ్ కలెక్టర్ భావన,డిఆర్ఓ మల్లికార్జునుడు, జిల్లా స్థాయి అధికారులు, ఆర్డీఓలు, పలు కార్పోరేషన్ ల డైరెక్టర్లు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# బలవంతపు భూసేకరణ ఆపాలని సీఎంకు వినతి

ఇబ్రహీంపట్నం, జూన్ 17 (విజన్ ఆంధ్ర ) : ఫ్యూచర్ సిటీ పేరుతో బలవంతపు భూసేకరణ ఆపాలని బుధవారం సీఎం రేవంత్ రెడ్డికి సీపీఐ(ఎం) నాయకులు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య మాట్లాడుతూ....ఫ్యూచర్ సిటీ పేరుతో బలవంతపు భూసేకరణ వెంటనే ఆపాలని డిమాండ్ చేశారు. ఫార్మాసిటీ నిషేధిత జాబితాలో నుంచి రైతుల పేర్లను తొలగించాలని కోరారు. రామోజీ ఫిలింసిటీ, ఫ్యాబ్ సిటీలో పేదలకు ఇండ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రంగారెడ్డి జిల్లాలో ఉన్న భూ సమస్యలను పరిష్కరించాలని కోరారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలన్నారు. పలు గ్రామాలకు సీసీ రోడ్లు మంజూరు చేయాలన్నారు. జిల్లా వ్యాప్తంగా రైతాంగ సమస్యలను పరిష్కరించాలని సీఎం రేవంత్ రెడ్డిని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో సీపీఐ(ఎం) పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బోడ సామెల్, దుబ్బాక రామచందర్, కందుకూరి జగన్, జిల్లా కమిటీ సభ్యులు రావుల జంగయ్య, అల్లంపల్లి నర్సింహ, తదితరులున్నారు.

# ఎస్ఐఆర్ పై బీఎల్ఓ లకు ప్రత్యేక శిక్షణ

ముధోల్:17జూన్:విజన్ ఆంధ్ర. ముధోల్ మండల కేంద్రమైన ముధోల్ లోని రైతు వేదికలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమంపై బుధవారం బాసర, ముధోల్ తహసిల్దార్ లు పవన్ చంద్ర, శ్రీలతలు బీఎల్ఓలకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కేంద్ర ఎన్నికల సంఘం జారీ చేసిన తాజా మార్గదర్శకాలు, ఓటరు జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ, ఇంటింటి గణన విధానం, ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ, సేకరణ, ఓటర్ల వివరాల ధ్రువీకరణ, మరణించడం,అభ్యంతరాల స్వీకరణ,బీఎల్ఏల విధులు, బాధ్యతలపై సమగ్ర అవగాహన కల్పించారు. ప్రతి ఇంటింటికి గణన కార్యక్రమాన్ని క్షేత్రస్థాయి లో సమర్థవంతంగా పారదర్శకంగా అమలు చేయాలన్నారు. ప్రతి అర్హత కలిగిన పౌరుడు ఓటరు జాబితాలో నమోదయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. సూచించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో బాసర,ముధోల్ మండలాల బీఎల్ ఓలు పాల్గొన్నారు.



# జేబులకు చిల్లు ఎందుకు...?

**- ఉచిత వైద్యం మీ గ్రామానికే వచ్చేసింది.!**

**- 100 మందికి పైగా ప్రజలకు ఉచిత ఆరోగ్య పరీక్షలు మందుల పంపిణీ**

**- వెల్ జర్ల లో హోమియోపతికి విశేష స్పందన.**




షాద్ నగర్, విజన్ ఆంధ్రా జూన్ 17: అనారోగ్యం వస్తే ఆసుపత్రి గడప తొక్కక తప్పదు. కానీ నేటి రోజుల్లో ప్రైవేట్ ఆసుపత్రుల బిల్లులు చూసి రోగి కంటే కుటుంబ సభ్యులే ఎక్కువగా భయపడే పరిస్థితి నెలకొంది. పరీక్షల పేరుతో వేల రూపాయలు, మందుల పేరుతో మరిన్ని ఖర్చులు... ఇలా ఒక సాధారణ వ్యాధి కూడా సామాన్య కుటుంబాల ఆర్థిక పరిస్థితిని దెబ్బతీస్తోంది. ఇలాంటి సమయంలో గ్రామీణ ప్రజలకు ఊరట కలిగించేలా వెల్ జర్ల గ్రామంలో ఉచిత హోమియోపతి వైద్య సేవలు అందుబాటులోకి గ్రామ సర్పంచ్ ఆర్ బాబు నాయక్ తీసుకువచ్చారు . జిమ్స్ హోమియోపతి మెడికల్ కాలేజ్ ఓ హాస్పిటల్ ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ సహకారంతో ప్రారంభమైన నూతన హోమియోపతి ఓపీడీకి గ్రామ ప్రజల నుంచి అనూహ్య స్పందన లభించింది. శిబిరంలో 100 మందికి పైగా ప్రజలకు బీపీ, షుగర్, ఆక్సిజన్ స్థాయిలు (రాజూూ2) తదితర పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వైద్యం అనేది ధనికులకు మాత్రమే కాదు, ప్రతి పేద కుటుంబానికి కూడా అందుబాటులో ఉండాలనే సంకల్పంతో ఈ కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ ఆర్. బాబు నాయక్ మాట్లాడుతూ...చిన్న చిన్న అనారోగ్య సమస్యలకే ప్రైవేట్ ఆసుపత్రుల్లో వేలాది రూపాయలు ఖర్చు చేసి అప్పుల పాలవుతున్న కుటుంబాలు ఎన్నో ఉన్నాయి. అలాంటి పరిస్థితుల్లో ప్రజల ఇంటి ముందుకే వైద్య సేవలు రావడం అభినందనీయమైన విషయం. గ్రామ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. జిమ్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.సి. దోలే హోమియోపతి వైద్య విధానం ప్రత్యేకతలను వివరించారు. తక్కువ ఖర్చుతో, దీర్ఘకాలిక వ్యాధులకు సమర్థవంతమైన చికిత్స అందించడంలో హోమియోపతి పాత్ర ఎంతో కీలకమని తెలిపారు. జిమ్స్ ఆసుపత్రిలో అందుబాటులో ఉన్న ఓపీడీ, ఐపీడీ సేవలపై కూడా ప్రజలకు అవగాహన కల్పించారు. డాక్టర్ విరాజ్ కుమార్, డాక్టర్ భవ్యశిక, పీజీ స్కాలర్లు, ఇంటర్న్లు సేవలందించారు. ప్రజల ఆరోగ్యం కోసం గ్రామాలకు వస్తున్న ఇటువంటి వైద్య శిబిరాలు కేవలం సేవా కార్యక్రమాలు మాత్రమే కాదు, పేదల జీవితాల్లో ఆశాకిరణాలు. ఖరీదైన చికిత్సల భయంతో వ్యాధులను నిర్లక్ష్యం చేయకుండా, ఉచితంగా లభిస్తున్న వైద్య సేవలను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాల్సిన అవసరం ఉంది. రోగం పెరిగే వరకు వేచి చూడకండి. ఆరోగ్య పరీక్షలు చేయించుకోండి. ఖర్చుతో కూడిన వైద్యం కోసం పరుగులు తీయకండి... మీ గ్రామానికి వచ్చిన ఉచిత వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ వెంకటేష్ , గ్రామ పాలకవర్గం సభ్యులు గ్రామ ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# శివంపేట ప్రభుత్వ పాఠశాలల ఘన విజయం

**- పదో తరగతిలో 100 శాతం ఉత్తీర్ణత సాధించిన జెడ్పీహెచ్ఎస్**

చౌటకూర్, జూన్ 17 (విజన్ ఆంధ్ర ): మండల పరిధిలోని శివంపేట గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (జెడ్పీహెచ్ఎస్) మరోసారి విశిష్ట ఫలితాలతో ప్రభుత్వ విద్యా ప్రమాణాలను చాటింది. 2025–26 విద్యా సంవత్సరానికి సంబంధించిన పదో తరగతి ఫలితాల్లో పాఠశాల 100 శాతం ఉత్తీర్ణత సాధించి మండలంలో ప్రత్యేక గుర్తింపు పొందింది. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు, వ్యక్తిత్వ వికాసానికి ప్రాధాన్యత ఇస్తూ పాఠశాల ఆదర్శ విద్యాసంస్థగా నిలుస్తోంది. ప్రభుత్వ పాఠశాలలు కూడా ప్రైవేట్ విద్యాసంస్థలకు ఏమాత్రం తీసిపోవని శివంపేట జెడ్పీహెచ్ఎస్ వరుస విజయాల ద్వారా నిరూపిస్తోంది. వేసవి సెలవుల్లో నిర్వహించిన ప్రత్యేక శిబిరాలు విద్యార్థుల్లో ఉత్సాహాన్ని నింపాయి. ఆటలు, యోగా, జ్ఞాపకశక్తి పెంపు కార్యక్రమాలు, క్రీడా పోటీలు, నాయకత్వ లక్షణాలను పెంపొందించే వినూత్న కార్యక్రమాల ద్వారా విద్యార్థులలో ఆత్మవిశ్వాసం, మానసిక వికాసం పెరిగిందని ఉపాధ్యాయులు తెలిపారు. ఈ కార్యక్రమాలు విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి ఎంతో దోహదపడ్డాయని తల్లిదండ్రులు అభినందిస్తున్నారు. పదో తరగతి ఫలితాల్లో పి. గాయత్రి 538 మార్కులతో ప్రథమ స్థానం, కె. నితిన్ 537 మార్కులతో ద్వితీయ స్థానం, ఈ. రచిత 534 మార్కులతో తృతీయ స్థానం సాధించారు. వీరు బాసర ట్రిపుల్ ఐటీ ప్రవేశాలకు అర్హత సాధించడం పాఠశాలకు, గ్రామానికి గర్వకారణంగా నిలిచింది. అదేవిధంగా 12 మంది విద్యార్థులు 500కు పైగా మార్కులు సాధించడం పాఠశాలలో అందుతున్న నాణ్యమైన బోధనకు నిదర్శనంగా నిలిచింది. ఈ విజయాలకు విద్యార్థుల కృషి, ఉపాధ్యాయుల అంకితభావం, తల్లిదండ్రుల సహకారం కారణమని గ్రామస్తులు అభిప్రాయపడుతున్నారు. రానున్న 2026–27 విద్యా సంవత్సరాన్ని దృష్టిలో ఉంచుకొని పాఠశాల ఆధ్వర్యంలో బడిబాట కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ప్రతి విద్యార్థి ప్రభుత్వ పాఠశాలలో చేరి నాణ్యమైన ఉచిత విద్యను పొందేలా తల్లిదండ్రులు సహకరించాలని ఉపాధ్యాయులు కోరుతున్నారు. విద్యతో పాటు సాంస్కృతిక, క్రీడా, విజ్ఞాన కార్యక్రమాలను నిర్వహిస్తూ విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి కృషి చేస్తున్నామని పాఠశాల సిబ్బంది తెలిపారు. గ్రామీణ విద్యార్థుల ప్రతిభను వెలికితీస్తూ ఉత్తమ ఫలితాలతో ముందుకు సాగుతున్న శివంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రభుత్వ విద్యకు చిరునామాగా నిలుస్తోందని స్థానికులు ప్రశంసిస్తున్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు వేదశ్రీతో పాటు ఉపాధ్యాయులు మల్లేశం, ఎం. రాములు, కె. వీరేశం, ఎస్. రాములు, ఎండి. మాజిద్, ఆర్. రమేష్, మాణిక్యం, శైలజ, శ్రీదేవి, స్వప్నశ్రీ, సునీత భాయి, సునీత వేణి, వాణిశ్రీ, నాగశ్రీ, షఫీయా, అన్వర్ తదితరులు పాల్గొన్నారు.

# ఆపన్న హస్తం కోసం ఎదురుచూపులు

**- ఆపరేషన్ కోసం రూ.5 లక్షలు.. - ఆటో డ్రైవర్ కుటుంబానికి ఆర్థిక సాయం విజ్ఞప్తి**



బెల్లంపల్లి జూన్ 17 విజన్ ఆంధ్ర : బెల్లంపల్లి పట్టణం టేకులబస్తి కి చెందిన ఆటో డ్రైవర్ కాటన్ రవికుమార్ కుటుంబం తీవ్ర ఆర్థిక సంక్షోభంలో ఉంది. ఆయన భార్య స్రవంతి అనారోగ్యంతో బాధపడుతూ ప్రస్తుతం చికిత్స పొందుతున్నారు. గత రెండు రోజులుగా అస్వస్థతతో బెల్లంపల్లి ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందిన ఆమె పరిస్థితి విషమించడంతో వైద్యులు కరీంనగర్‌లోని లక్ష్మీనరసింహ ఆసుపత్రికి రిఫర్ చేశారు. అక్కడ వైద్యులు అవసరమైన ఆపరేషన్ కోసం సుమారు రూ.5 లక్షల వరకు ఖర్చు అవుతుందని తెలిపారు. ఫ్రీ బస్సు సౌకర్యం కారణంగా ఆటో గిరాకీ తగ్గడంతో ఉపాధి కూడా తగ్గిందని, దీంతో కుటుంబం ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటోందని తోటి డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వీరికి ఇద్దరు చిన్న ఆడపిల్లలు ఉండగా, సొంత ఇల్లు లేకపోవడం పరిస్థితిని మరింత కష్టతరంగా ఉందని అన్నారు. ఈ నేపథ్యంలో తోటి ఆటో డ్రైవర్లు, మిత్రులు, ప్రజలు ముందుకు వచ్చి ఆర్థిక సహాయం అందించాలని కుటుంబ సభ్యులు, సహచరులు విజ్ఞప్తి చేస్తున్నారు. సహాయం కోసం ఫోన్‌పే / గూగుల్‌పే నంబర్: 9705551457 కు ఆర్థిక సహాయం అందించాలని వేడుకుంటున్నారు.



## సాధారణ ప్రసవాల సంఖ్య పెంచాలి....

**జిల్లా వైద్యాధికారి రాజశ్రీ..**

**బోధన్ జిల్లా ఆసుపత్రిలో "మార్పు" కన్వర్జెన్స్ సమావేశం నిర్వహణ..**

బోధన్, జూన్ 17(విజన్ ఆంధ్ర) : నిజామాబాద్ జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. రాజశ్రీ ఆధ్వర్యంలో జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి డా. శ్రీనివాస్, బోధన్ డివిజన్ ఉప జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి డా. విద్య ల సమక్షంలో బోధన్ జిల్లా ఆసుపత్రిలో "మార్పు" కన్వర్జెన్స్ సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సమావేశంలో మార్పు బృంద సభ్యులు, జిల్లా ఆసుపత్రి వైద్యులు, గైనకాలజిస్టులు, సిబ్బంది పాల్గొన్నారు. గర్భిణీలకు నాణ్యమైన గర్భధారణ పూర్వ సేవలు అందించడం, అన్ని గర్భిణీలకు తప్పనిసరిగా ఏఎన్సి పరీక్షలు నిర్వహించడం, అధిక ప్రమాద గర్భధారణలు ఉన్న వారిని ముందుగానే గుర్తించి ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించడం వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్యాధికారి మాట్లాడుతూ సాధారణ ప్రసవాల శాతాన్ని పెంచేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని, గర్భిణీలకు సమయానుకూల వైద్య సేవలు అందించాలని సూచించారు. మాతృ మరణాలు, శిశు మరణాలు సంభవించకుండా ప్రతి గర్భిణిని క్షుణ్ణంగా పర్యవేక్షించాలని వైద్య సిబ్బందికి ఆదేశించారు. అలాగే హై రిస్క్ గర్భిణీలకు రిఫరల్ సేవలు, ప్రత్యేక వైద్య పర్యవేక్షణ, అవసరమైన పరీక్షలు, చికిత్సలు సకాలంలో అందేలా చర్యలు చేపట్టాలని సూచించారు. గ్రామ స్థాయి నుండి జిల్లా ఆసుపత్రి వరకు అన్ని విభాగాల మధ్య సమన్వయంతో పనిచేసి సురక్షిత మాతృత్వ లక్ష్యాలను సాధించాలని కోరారు.

## ఘనంగా మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ జన్మదిన వేడుకలు

**- చిత్తారమ్మ తల్లి సన్నిధిలో ప్రత్యేక పూజలు**

**- ఆలయం నుంచి నివాసానికి అభిమానులు, కార్యకర్తలతో ర్యాలీ**

కుత్బుల్లాపూర్, జూన్ 17 (విజన్ ఆంధ్ర): కుత్బుల్లాపూర్ మాజీ శాసనసభ్యులు కూన శ్రీశైలం గౌడ్ జన్మదినం సందర్భంగా బుధవారం తన ఇష్టదైవమైన ప్రఖ్యాత శ్రీ చిత్తారమ్మ తల్లిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో కూన శ్రీశైలం గౌడ్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో కేక్ కట్ చేసి, అభిమానులు, కార్యకర్తలు, స్థానిక ప్రజాప్రతినిధులు ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. పలువురు అభిమానులు పూలమాలలు వేసి ఘనంగా సత్కరించారు. అనంతరం ఆలయం నుంచి ఆయన నివాసం వరకు కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్న ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ మార్గమంతా నినాదాలు, శుభాకాంక్షలతో సందడి నెలకొంది. ఈ సందర్భంగా కూన శ్రీశైలం గౌడ్ ప్రజల ప్రేమాభిమానాలు తనపై ఎల్లప్పుడూ ఇలాగే కొనసాగాలని ఆకాంక్షిస్తూ, తన జన్మదిన వేడుకలను విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# విద్యార్థులకు పాఠ్యపుస్తకాల పంపిణీ

దౌల్తాబాద్, జూన్ 17 (విజన్ ఆంధ్ర): విద్యార్థులు నాణ్యమైన విద్యను అభ్యసించి ఉన్నత లక్ష్యాలను సాధించాలని మండల విద్యాధికారి గజ్జల కనకరాజు సూచించారు. దౌల్తాబాద్ మండల పరిధిలోని తిర్మలాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం విద్యార్థులకు నూతన విద్యా సంవత్సరానికి సంబంధించిన పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న మండల విద్యాధికారి గజ్జల కనకరాజు, గ్రామ సర్పంచ్ బండారు లాలూ విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను అందజేశారు. ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తూ నాణ్యమైన విద్య అందించేందుకు కృషి చేస్తోందని వారు తెలిపారు. పాఠ్యపుస్తకాలను సక్రమంగా వినియోగించుకుని విద్యార్థులు చదువులో రాణించాలని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న విద్యా సంస్కరణలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని, ఉపాధ్యాయులు కూడా విద్యార్థుల భవిష్యత్తు కోసం అంకితభావంతో పనిచేయాలని పేర్కొన్నారు. పాఠశాలల్లో మెరుగైన విద్యా వాతావరణం కల్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందన్నారు.



కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పడాల రాములు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉపాధ్యాయులు సమిష్టిగా కృషి చేయాలని అన్నారు. మాజీ సర్పంచ్ యాదవ రెడ్డి విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ విద్యను ఆయుధంగా మలచుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు,తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# ఓటు హక్కు పరిరక్షణే ప్రజాస్వామ్యానికి బలమైన పునాది.

**--ఎస్ ఐ ఆర్ అవగాహన కార్యక్రమంలో ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి.**

తాండూరు, జూన్ 17 (విజన్ ఆంధ్ర) ఓటు హక్కు పరిరక్షణ ప్రజాస్వామ్యానికి బలమైన పునాది అని ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి అన్నారు. ఎస్ఐఆర్ అవగాహన కార్యక్రమంలో భాగంగా బుధవారం ఆర్డీఓ అనిత ఆధ్వర్యంలో తాండూరు పట్టణంలోని ఇందిరా చౌక్ నుండి సెయింట్ మార్క్స్ స్కూల్ వరకు నిర్వహించిన 2కే రన్‌లో స్థానిక ఎమ్మెల్యే బుయ్యాని మనోహర్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బుయ్యాని మనోహర్ రెడ్డి మాట్లాడుతూ... ఎస్ఐఆర్ అవగాహన కోసం వేస్తున్న ప్రతి అడుగు ప్రజా చైతన్యానికి నాంది అన్నారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ప్రతి పౌరుడికి అత్యంత విలువైన రాజ్యాంగబద్ధమైన హక్కు. ఈ హక్కును పరిరక్షించడం, ప్రతి అర్హుడి పేరు ఓటరు జాబితాలో నమోదు కావడం మనందరి బాధ్యత అన్నారు. ఈ 2కే రన్ కేవలం ఒక పరుగు కార్యక్రమం కాదని ప్రజాస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసే ప్రజా చైతన్య యాత్ర అన్నారు. నకిలీ ఓట్లకు తావులేకుండా, ప్రతి అర్హుడికి ఓటు హక్కు కల్పించేలా ప్రతి బి ఎల్ ఓ తో ప్రతి బి ఎల్ ఏ అత్యంత బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. ప్రజాప్రతినిధులు,




అధికారులు, యువత కలిసి ఓటు హక్కు ప్రాముఖ్యతను ప్రతి ఇంటికి చేర్చాలి. 'మన ఓటు -- మన భవిష్యత్తు', 'ప్రతి అర్హుడి పేరు ఓటరు జాబితాలో ఉండాలి' అనే సంకల్పంతో ముందుకు సాగుదామని అన్నారు. ప్రజాస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని నేను కోరుతున్నాను అని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పట్లోళ్ల నీరజ బాల్‌రెడ్డి, వైస్ చైర్మన్ అబ్దుల్ రజాక్,తాండూర్ ఆర్డీఓ అనిత, మున్సిపల్ కమిషనర్ రాకేష్ రెడ్డి, ఎమ్మార్వోలు, అధికారులు, వార్డు కౌన్సిలర్లు, మరియు పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

# ఆదివాసుల మధ్య చిచ్చు పెడుతున్న అటవీ అధికారులపై చర్యలు తీసుకోవాలి

**- ఆదివాసులకు న్యాయం చేయాలనీ ఐటిడిఏ పివో మంద మకరంద ను కోరిన మాజీ ఎంపీ సోయం బాపూరావు.**

ఉట్నూర్, జూన్ 17, (విజన్ ఆంధ్ర) : నిర్మల్ జిల్లా కడెం మండలంలోని ఉడుంపూర్ పంచాయితీ పరిధిలోని మైసంపేట్ పునరావాస గ్రామస్తులకు వ్యవసాయ భూములు హద్దుల విషయం లో ఘర్షణ. ఆదివాసులపై ఫారెస్ట్ అధికారులు మహిళలు అని చూడకుండా కాళ్ళతో తన్నడం సరైంది కాదని, అధికారులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని ఐటిడిఏ పివో మంద మకరందు కు మాజీ ఎంపీ సోయం బాపూరావు బాధిత కుటుంబ సభ్యులతో కలిసి వినతిపత్రం అందజేశారు. ఫారెస్ట్ అధికారులు కావాలనే ఆదివాసుల మధ్య చిచ్చు పెడుతున్నరని, అమాయక ఆదివాసులపై దాడులు చేస్తున్నారన్నారు. దాదాపు 20 మంది ఆదివాసులకు అరెస్టు చేసి ఎక్కడ ఉంచారో కుటుంబ సభ్యులకు సైతం చెప్పడం లేదన్నారు. ఇప్పటికైనా ఫారెస్ట్ అధికారులపై చర్యలు తీసుకోని న్యాయం చెయ్యాలని డిమాండ్ చేశారు. గత 30 సంవత్సరాల నుండి వ్యవసాయం



చేసుకుంటున్న ఆదివాసీలపై ఫారెస్ట్ అధికారులు కక్ష పూరీతంగా వ్యవరిస్తున్నారని, గత సంవత్సరం కూడా రిజర్వ్ టైగర్ జోన్ పేరుతో ఆసిఫాబాద్ జిల్లాలో వందల ఆదివాసీ గ్రామాలను తరలించే ప్రయత్నం చేసారని అప్పుడు సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరించడం జరిగిందన్నారు. ఆదివాసుల జోలికి వస్తే ఊరుకునేది లేదన్నారు. గ్రామస్తులు మాట్లాడుతూ గత రెండు నెలల ముందే అధికారులు హద్దులు చూపించి మళ్ళీ తమ భూముల్లో వచ్చి ఆదివాసులకు చిచ్చు పెడ్తున్నారని పివో దృష్టికి తీసుకెళ్లారు. దింతో సానుకూలంగా స్పందించిన పివో అధికారులతో మాట్లాడి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.



## విత్తన దుకాణాల ఆకస్మిక తనిఖీ చేసిన టాస్క్ ఫోర్స్ బృందం

ఏన్కూరు, జూన్ 17(విజన్ ఆంధ్ర): ఏన్కూరులోని పలు విత్తన దుకాణాలను టాస్క్ ఫోర్స్ బృందం ఆకస్మికంగా తనిఖీ చేసింది. ఈ సందర్భంగా విత్తన దుకాణాల్లోని స్టాకు, రిజిస్టర్లను మండల వ్యవసాయ అధికారి నరసింహారావు, స్థానిక ఎస్సై సంధ్య పరిశీలించారు. గత ఏడాది నకిలీ విత్తనాలు పట్టుపడిన వారి ఇళ్లను మరియు పెరడ్లను ఇతర ప్రాంతాలను తనిఖీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. మండలంలో ఉన్న విత్తన దుకాణాదారులు నకిలీ విత్తనాలు అమ్మకూడదదని, అమ్మితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. రైతుల వద్ద కాని, గ్రామాల్లో కాని ఇంటిలో విత్తనాలు పెట్టి అమ్మితే వారిపై పీడీ యాక్ట్ నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ శ్రీహరి, వ్యవసాయ విస్తరణ అధికారి సపావట్ సైదులు పాల్గొన్నారు.

## ఆటో కార్మికుల సమస్యలపై కవితకు వినతి

### ఫ్రీ బస్సు వల్ల జీవనోపాధి దెబ్బతిన్నదని ఆవేదన

బెల్లంపల్లి జూన్ 17 విజన్ ఆంధ్ర : ఆటో కార్మికుల సమస్యలపై తెలంగాణ రాష్ట్ర సంరక్షణ సమితి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ను గోదావరి ఖని లో లిసి ఆటో కార్మికుల ప్రతినిధులు వినతి పత్రం సమర్పించారు. ఫ్రీ బస్సు పథకం కారణంగా తమ జీవనోపాధి తీవ్రంగా దెబ్బతిన్నదని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

సుమారు 7.5 లక్షల మంది ఆటో కార్మికులు రాష్ట్రంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఇప్పటికే ఆర్థిక సమస్యలతో పలువురు మృతి చెందారని వారు తెలిపారు. ఈ సమస్యను ప్రతిపక్ష హోదాలోనైనా ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాలని కోరారు.

వినతి పత్రంపై స్పందించిన కవిత ఆటో కార్మికుల సమస్యలపై పోరాటం చేస్తామని హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు. కార్యక్రమంలో పలువురు ట్రేడ్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

# రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

**-- ఎమ్మెల్యే బుయ్యాని మనోహర్ రెడ్డి.**

**--రైతులకు విత్తనాలను పంపిణీ చేసిన ఎమ్మెల్యే.**



తాండూరు, జూన్ 17 (విజన్ ఆంధ్ర ) రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని తాండూరు ఎమ్మెల్యే బుయని మనోహర్ రెడ్డి అన్నారు.తాండూరు పట్టణంలోని డీసీఎంఎస్ కార్యాలయంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు ఉచిత రెడ్‌గ్రామ్ కంది, మినుములు, పెసర్లు విత్తనాల పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ప్రభుత్వం రైతు సంక్షేమాన్ని అత్యంత ప్రాధాన్యంగా తీసుకుని, రైతుల ఆదాయాన్ని పెంచే దిశగా అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. రైతులకు నాణ్యమైన విత్తనాలను అందించడం ద్వారా పప్పుధాన్యాల ఉత్పత్తి పెరుగుతుందని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వ్యవసాయంలో ఆధునిక పద్ధతులు, నాణ్యమైన విత్తనాల వినియోగం వల్ల దిగుబడులు పెరిగి రైతులకు అధిక లాభాలు చేకూరుతాయని తెలిపారు. ప్రభుత్వం రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, సాగునీరు, విద్యుత్ తదితర సౌకర్యాలను అందించేందుకు కట్టుబడి ఉందన్నారు. తాండూరు నియోజకవర్గంలోని రైతుల అభివృద్ధి కోసం ఎల్లప్పుడూ కృషి చేస్తానని, రైతులు ఎలాంటి సమస్యలు ఎదుర్కొన్నా తన దృష్టికి తీసుకురావాలని కోరారు. రైతు బాగుంటేనే గ్రామం బాగుంటుందని, గ్రామాలు అభివృద్ధి చెందితేనే రాష్ట్రం ప్రగతి పథంలో ముందుకు సాగుతుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. అన్నదాత సంతోషమే ప్రభుత్వ లక్ష్యం.. రైతు అభివృద్ధే రాష్ట్ర అభివృద్ధికి బలమైన పునాది అని ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి గారు అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ నీరజ బాల్ రెడ్డి, ఏఎంసీ చైర్మన్ పట్లోళ్ల నర్సింలు, ఆత్మ కమిటీ చైర్మన్ శంకర్ రెడ్డి, ఏడీఏ అరుణ ,మున్సిపల్ కమిషనర్ రాకేష్ రెడ్డి, వ్యవసాయ శాఖ అధికారులు, రైతులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జన్ను విజయ్‌కుమార్‌కు డాక్టరేట్

## – ఘన సత్కారం



మహాదేవపూర్ జూన్ 17 (విజన్ ఆంధ్ర) : జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపురం మండల్ స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా. జన్ను విజయ్‌కుమార్‌కు కాకతీయ విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రదానం చేయడం అభినందనీయమని కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పేర్కొన్నారు.

కాకతీయ విశ్వవిద్యాలయం రాజనీతి శాస్త్ర విభాగంలో “కరీంనగర్ జిల్లాలో గిరిజన అభివృద్ధి పరిపాలన (ట్రైబల్ డెవలప్మెంట్ అడ్మినిస్ట్రేషన్ )” అనే అంశంపై పరిశోధన నిర్వహించి సిద్ధాంత గ్రంథాన్ని సమర్పించినందుకు డా. జన్ను విజయ్‌కుమార్‌కు డాక్టరేట్ ప్రదానం చేయబడింది. ఈ పరిశోధనను రిటైర్డ్ ప్రొఫెసర్ వీరన్న పర్యవేక్షణలో పూర్తి చేశారు. ఈ సందర్భంగా ప్రముఖ సినీ గేయ రచయిత వేటూరి సుందరరామమూర్తి గారి

“కృషి ఉంటే మనుషులు ఋషులౌతారు,
మహాపురుషులౌతారు, తరతరాలకు తరగని వెలుగౌతారు”

అనే గేయం అక్షరాలా డా. జన్ను విజయ్‌కుమార్ గారికి సరిపోతుందని పలువురు అభిప్రాయపడ్డారు. గత 16 సంవత్సరాలుగా డిగ్రీ కళాశాలలో విద్యాబోధన చేస్తూ అపారమైన అనుభవాన్ని సంపాదించిన ఆయన, తన కృషి, పట్టుదల, ఆత్మవిశ్వాసంతో 57 ఏళ్ల వయసులో డాక్టరేట్ సాధించడం విశేషమని కొనియాడారు. డాక్టరేట్ సాధించిన సందర్భంగా కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు డా. జన్ను విజయ్‌కుమార్‌ను శాలువాతో ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు.

# యూరియా బుకింగ్ యాప్‌ను ప్రారంభించిన జిల్లా కలెక్టర్ అంకిత్

**ప్రతి రైతుకు తగినంత ఎరువులు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కోరం కనకయ్య.**

టేకులపల్లి, జూన్ 17: రైతులు ఇంటి వద్ద నుంచే యూరియాను సులభంగా బుక్ చేసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన ఫెర్టిలైజర్ బుకింగ్ యాప్‌ను జిల్లా కలెక్టర్ అంకిత్ బుధవారం టేకులపల్లి మండలంలోని బేతంపూడి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య పాల్గొన్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ జిల్లాలో వ్యవసాయ అవసరాల కోసం సుమారు 40 వేల మెట్రిక్ టన్నుల యూరియా అవసరమవుతుందని, ప్రస్తుతం 15 వేల మెట్రిక్ టన్నుల నిల్వలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అవసరమైన మేరకు యూరియా సరఫరా చేసేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు చేపడుతోందన్నారు.



అవసరానికి మించి యూరియా వినియోగించడం వల్ల భూసార నాణ్యత దెబ్బతినే ప్రమాదం ఉందని, రైతులు వ్యవసాయ శాఖ అధికారుల సూచనల మేరకు సమతుల్య ఎరువుల వినియోగం, శాస్త్రీయ వ్యవసాయ పద్ధతులను అనుసరించాలని సూచించారు. అలాగే ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తక్కువగా నమోదయ్యే అవకాశాలు ఉన్నందున రైతులు పంటల వైవిధ్యీకరణ, పంట మార్పిడి విధానాలను అవలంబించాలని సూచించారు.ఎమ్మెల్యే కోరం కనకయ్య మాట్లాడుతూ ప్రతి రైతుకు తగినంత ఎరువులు అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. రైతులకు ఎరువుల కొరత తలెత్తకుండా ప్రభుత్వం నిరంతరం చర్యలు చేపడుతోందని తెలిపారు. ఫెర్టిలైజర్ బుకింగ్ యాప్ రైతుల సౌలభ్యాన్ని దృష్టిలో ఉంచుకుని తీసుకొచ్చిన వినూత్న కార్యక్రమమని అన్నారు.

అనంతరం ఫెర్టిలైజర్ బుకింగ్ యాప్ ద్వారా యూరియా బుక్ చేసుకున్న రైతులకు కలెక్టర్ అంకిత్, ఎమ్మెల్యే కోరం కనకయ్య చేతుల మీదుగా యూరియా బస్తాలను అందజేశారు.అదే రోజు టేకులపల్లి మండలంలోని ఏ కాలనీలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇండ్ల పురోగతిని కలెక్టర్ అంకిత్, ఎమ్మెల్యే కోరం కనకయ్య పరిశీలించారు. నిర్మాణ పనులను నాణ్యతతో, వేగవంతంగా పూర్తి చేసి లబ్ధిదారులు త్వరగా గృహ ప్రవేశం చేసుకునేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.



## విద్యార్థులకు పాఠ్య పుస్తకాల పంపిణీ...

బోధన్,జూన్ 17(విజన్ ఆంధ్ర) : బోధన్ పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల (జేసీ)లో విద్యార్థులకు నూతన పాఠ్య పుస్తకాలు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. బుధవారం పాఠశాలలో చేపట్టిన కార్యక్రమానికి మున్సిపల్ చైర్ పర్సన్ తూము పద్మశరత్ రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ ఫ్లోర్ లీడర్ శరత్ రెడ్డి, ప్రధానోపాధ్యాయులు బాలచంద్రం, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## పేద విద్యార్థుల సేవలకు గుర్తింపు

### - మడే రాజేష్‌కు గౌరవ డాక్టరేట్

బెల్లంపల్లి, జూన్ 17 విజన్ ఆంధ్ర : బెల్లంపల్లి మండలం పాత బెల్లంపల్లి గ్రామానికి చెందిన మడే రాజేష్‌కు గౌరవ డాక్టరేట్ పురస్కారం లభించింది. పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి ఆర్థిక సహాయం అందించడం, అలాగే కోవిడ్ మహమ్మారి సమయంలో చేసిన సేవా కార్యక్రమాలను గుర్తించి ఈ గౌరవాన్ని ప్రదానం చేశారు.
ఏషియన్ వేదిక్ ఇంటర్నేషనల్ కల్చర్ అండ్ రీసెర్చ్, స్ఫూర్తి అకాడమీ సంస్థలు సంయుక్తంగా ఈ ప్రతిష్టాత్మక గౌరవ డాక్టరేట్‌ను ఆయనకు అందజేశాయి. హైదరాబాద్ బొగ్గులకుంటలోని సరస్వత పరిషత్‌లో గత సోమవారం జరిగిన కార్యక్రమంలో డాక్టర్ గూడూరు చిన్నారెడ్డి, యాదగిరి గౌడ్, సరితలు రాజేష్‌కు అవార్డు ప్రదానం చేశారు.
ఈ సందర్భంగా మడే రాజేష్ మాట్లాడుతూ ఈ గౌరవం తనపై మరింత బాధ్యతను పెంచిందని, భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు కొనసాగిస్తానని తెలిపారు.

## ప్రత్యేక ఓటర్ల సవరణ జాబితా కార్యక్రమం

కుల్కచర్ల, జూన్, 17 (విజన్ ఆంధ్ర) : కుల్కచర్ల మండల కేంద్రంలో ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమం చేపట్టినట్లు ఎంపీడీవో రామకృష్ణ నాయక్, ఎస్సై రమేష్ కుమార్, డీటీ చంద్రశేఖర్ తెలిపారు. మండల కేంద్రమైన కుల్కచర్లలో ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో భాగంగా 2కె రన్ కార్యక్రమం ప్రారంభించారు. వారు మాట్లాడుతూ...ఓటర్ల జాబితా సవరణకు ఎన్నికల కమీషన్ అవకాశం కల్పించడం జరిగిందన్నారు. ఓటర్ల జాబితాలో మార్పులు, చేరతపులకు ఇది ఒక మంచి అవకాశం అన్నారు. ఒటరు జాబితాలో ఏమైనా సమస్యలు ఉంటే తహసీల్దార్ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో రెవెన్యూ, పంచాయతీ రాజ్, పోలీసు శాఖ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.




# శ్రీ కాళేశ్వర ఆలయ పునర్నిర్మాణ పనులకు ప్రత్యేక పూజలు..!

### బాలాలయంలో విగ్రహాల ప్రాణ ప్రతిష్ఠ..!

### ఆది ముక్తీశ్వరా స్వామి ఆలయంలోనే భక్తులకు దర్శనాలు..!

మహాదేవపూర్ జూన్ 17 (విజన్ ఆంధ్ర) : జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపురం మండలం కాళేశ్వరం గ్రామం లోని దక్షిణ కాశీగా ప్రసిద్ధిగాంచిన శ్రీ కాళేశ్వర ముక్తీశ్వర స్వామి దేవస్థానం పునర్నిర్మాణ కార్యక్రమంలో భాగంగా బుధవారం తెల్లవారుజామున 5 గంటల నుంచి ఆలయంలో ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. దేవస్థానం కార్యనిర్వహణాధికారి (ఈఓ) ఎస్. మహేష్ ఆధ్వర్యంలో స్వామివారికి పూలు, పండ్లు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శృంగేరి జగద్గురువుల ఆశీస్సులతో వచ్చిన శిష్యబృందం, తొమ్మిది మంది వేద పండితుల ఆధ్వర్యంలో మహా గణపతి పూజ అనంతరం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన యాగశాలలో పంచబ్రహ్మ హోమం, శాంతి పూజలు, ప్రాయశ్చిత్త హోమాలు నిర్వహించారు. అనంతరం శ్రీ కాళేశ్వర ముక్తీశ్వర స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అలాగే విజయ గణపతి, పార్వతి (శుభానంద) మాత, మహా సరస్వతి మాత, సుబ్రహ్మణ్య స్వామి ఆలయాల్లోనూ పూజలు నిర్వహించి, పంచలోహ బింబాలలో ప్రాణప్రతిష్ఠ చేపట్టారు. శృంగేరి పీఠాధిపతి శ్రీ విధుశేఖర భారతీ స్వామివారు బాలాలయ పూజల నిమిత్తం పంపించిన కాళేశ్వర ముక్తీశ్వర స్వామివారి చిన్న లింగాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం బాజాభజంత్రులు, వేదమంత్రోచ్చారణల మధ్య ప్రధాన అర్చకులు నగేష్ శర్మ ఆధ్వర్యంలో ఐదుగురు అర్చకులు కళశాలను ఊరేగింపుగా తీసుకెళ్లి, ఆదిముక్తీశ్వర స్వామి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన బాలాలయ మండపంలో శృంగేరి పీఠ శిష్యబృందం చేత ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈఓ ఎస్. మహేష్, దేవస్థానం చైర్మన్ మోహన్ శర్మ, ధర్మకర్తలు సత్యనారాయణ, సీతయ్య, శ్యామ్ సుందర్, సీతారాం, దుర్గయ్య, అశోక్, పద్మ, రాజయ్య, ప్రశాంత్ రెడ్డి, శ్రీధర్ రావు, సత్యం తదితరులను శృంగేరి పీఠం శిష్యబృందం సన్మానించి, ఆశీర్వదించి స్వామివారి ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో గ్రామస్తులు భక్తులు పాల్గొన్నారు.

# ఎర్రగుంటపల్లిలో కొత్త బోర్ మోటార్ ఏర్పాటు

### - తాగునీటి సమస్య పరిష్కారానికి సర్పంచ్ సడవలి చర్యలు

కాటారం డివిజన్ ప్రతినిధి, జూన్ 17 (విజన్ ఆంధ్ర) : కాటారం గ్రామపంచాయతీ పరిధిలోని ఎర్రగుంటపల్లిలో బోర్ మోటార్ చెడిపోవడంతో ఏర్పడిన తాగునీటి సమస్యను దృష్టిలో ఉంచుకుని, గ్రామ సర్పంచ్ పంతకాని సడవలి వెంటనే స్పందించి కొత్త బోర్ మోటార్‌ను ఏర్పాటు చేయించారు.
ఎండాకాలంలో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా చూడటమే లక్ష్యంగా సర్పంచ్ సడవలి ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. గ్రామ ప్రజలకు నిరంతరంగా స్వచ్ఛమైన తాగునీరు అందేలా అవసరమైన ఏర్పాట్లు చేస్తూ, అధికారులతో సమన్వయం చేసుకుంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారు.
గ్రామ ప్రజల అవసరాలను గుర్తించి ప్రతి ఇంటికి తగినంత తాగునీరు అందించేందుకు ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని సర్పంచ్ తెలిపారు. గ్రామాభివృద్ధి, ప్రజాసేవల పట్ల అంకితభావంతో పనిచేస్తూ కాటారం



గ్రామాన్ని మరింత అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు ప్రజల సహకారం అవసరమని ఆయన పేర్కొన్నారు.
ఈ కార్యక్రమంలో 10వ వార్డు సభ్యుడు మానేం రాజబాబు, తైనేని సతీష్, గోనె రవి, గోనె వెంకటస్వామి, కొట్టే వెంకటస్వామి, ప్రజోత్, ఊరకొండ తేజ, హర్ష తదితరులు పాల్గొన్నారు.

# బస్సు యాత్రను అడ్డుకుంటాం

### - ఆదివాసీ సంఘాలు

### - ఇంద్రవెల్లి ఆదివాసి సంఘాల ఆధ్వర్యంలో ప్రెస్ మీట్

ఇంద్రవెల్లి, జూన్ 17, (విజన్ ఆంధ్ర) : ఈ నెల 25 నుండి ఆదివాసి గిరిజనుల ఎస్టీ రిజర్వేషన్ కల్పించి 50 సంవత్సరాలు పూర్తయిందని నిర్వహించబోయే బస్సు యాత్రను అడ్డుకుంటాం. ఆదివాసులకు ఎస్టీ రిజర్వేషన్ ఎవరు ఇచ్చింది కాదు ఆదివాసి వీరుల పోరాటం వల్ల వచ్చిన రిజర్వేషన్. ఇంద్రవెల్లి మండలంలోని అమరవీరుల స్థూపం వద్ద ఆదివాసి సంఘాల ప్రెస్ మీట్ నిర్వహించడం జరిగింది. ఆదివాసీ సంఘాల నాయకులు మాట్లాడుతూ టిపిసిసి ఆదివాసి కాంగ్రెస్ చైర్మన్ ఎమ్మెల్సీ శంకర్ నాయక్ ఆధ్వర్యంలో ఆదివాసి గిరిజనులకు ఎస్టీ రిజర్వేషన్ కల్పించి 50 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఆదివాసి గిరిజన ప్రజలకు తెలియజేసేందుకు రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక బస్సు యాత్ర నిర్వహించాలని ఈ నెల 25న టిపిసిసి ఆదివాసి కాంగ్రెస్ నిర్ణయించడాన్ని ఆదివాసులు అందరు కూడా వ్యతిరేకిస్తున్నారు. భారతదేశ మూలవాసులు ఆదివాసులు అనగా ఆది నుంచి భారతదేశంలో ఉంటున్న భారతీయులు వీరిని మొదటగా పూర్వ ఆదివాసులని పిలిచేవారు. ఈ వారసత్వమే ఫలితంగా ప్రస్తుత ఆదివాసి తెగలు ఉన్నాయి, రాజ్యాంగం లోని ఐదవ షెడ్యూల్ పేరా ప్రకారం షెడ్యూల్(1)పేరా ప్రకారం షెడ్యుల్ ప్రాంత విద్య ఉపాధి రాజకీయ ఉద్యోగాలన్నీ 1950 ముందు నుంచి స్థిర నివాసం కలిగి ఉన్న ఆదివాసి తెగలకు మాత్రమే వివిధ శాఖలలో ఉద్యోగాలు



నింపబడాలి. 79 ఏళ్ల స్వతంత్ర్య పాలనలో పాలకవర్గ రాజకీయ పార్టీలు ఆదివాసుల అభివృద్ధికి పాటుపడకుండా ఆదివాసులను అణగద్రోక్కే విధానాలకు పాల్పడుతున్నారు. ఓటు బ్యాంకు రాజకీయాలకు ప్రాణం పోస్తూ కులాలను తెగలలో విలీనం చేసి ఆదివాసి జీవితాలకు ప్రశ్నార్థకంగా చేస్తున్నారు. దీనికి కారణం 1976లో అక్రమంగా ఎస్టీ జాబితాలో కలపడాన్ని కల్పబడిన లంబాడీలు ఆదివాసులకు అందవలసిన రిజర్వేషన్ దోచుకుంటున్నారు. పాలకులు మాత్రం ఏం పట్టనట్టుగా ఉండటం దీనికి సహించేలేనీ ఆదివాసీల రిజర్వేషన్లు దగాబడుతున్న నేడు పోరాట మార్గమే శరణ్యంగా ఆదిలాబాద్ నుండి మరో చరిత్రక పోరాటాన్ని సిద్ధమవుతున్నాము. లంబాడిలను ఎస్టీ జాబితా నుంచి తొలగిస్తేనే ఆదివాసులకు మనుగడా అని, ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని పేర్కొన్నారు. ఆదివాసీ హక్కుల పోరట సమితి తుడుందెబ్బ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పుర్క బాపురావ్, గోండ్వాణ పంచయతి రాయిసెంటర్ మేస్రం దుర్గు, ఆదివాసి సంక్షేమ పరిషత్ ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు సెడ్మకి రామరావ్, కోరేంగ సీతరామ్, మడవి శేకు, దుర్వ హన్ను పటెల్, సోయం వినోద్, భీంరావ్, తోడషం ఇంద్రు తదితరులు పాల్గొన్నారు.